

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 24 నవంబరు 2024 | 5





ధారపల్లి జలపాతం

ఆదివారం ప్రత్యేకం

జల జల జల జలపాతం నువ్వు..



రమణీయమైన ప్రకృతి సౌందర్యానికి దాసోహం కాని వారెవరు.. అందుకే కార్తీక మాసం వచ్చిందంటే ప్రతి ఒక్కరూ ప్రకృతి ఒడిలో ఒదిగిపోవాలని తపిస్తారు. పిక్నిక్‌ల పేరిట సహజమైన సుందర ప్రదేశాలకు సందర్శనకు క్యూకడతారు. అహ్లాదం కలిగించే తోటలు, హాయినిచ్చే ఏజెన్సీ ప్రాంతాల్లో విహరిస్తారు. వేకువజామునే మంచు తెరలు వీడి చల్ల గాలులు వీస్తుండగా ఆయా ప్రాంతాలకు బయలుదేరి సరికొత్త లోకంలోకి వెళ్లిన అనుభూతి పొందుతారు. అక్కడ ఆటపాటలతో, మధురమైన జ్ఞాపకాలను మూటగట్టుకుని తిరిగి వస్తారు. ఇలాంటి ఎన్నో ప్రకృతి రమణీయ ప్రాంతాలకు ఉమ్మడి తూర్పుగోదావరి నెలవు. మరీ ముఖ్యంగా అబ్బురపరిచే జలపాతాలకు పెట్టింది పేరు. దట్టమైన అటవీ ప్రాంతాల్లోకి వెళ్లి కొండల్లోంచి వాగుల్లోకి జాలువారుతున్న జలపాతాల్లో తడిసి ముద్దయ్యాక పొందే ఆనందం మాటల్లో చెప్పలేనిది. ఆ జల పాతాల సవ్వడి మీరూ వింటారా మరి..

ఉమ్మడి తూర్పుగోదావరిలో ఎన్నెన్నో సోయగాల జలపాతాలు
జాలువారుతూ.. మైమరిపిస్తూ...
అటు ఏజెన్సీ, ఇటు రిజర్వు ఫారెస్టులోనూ నిత్య సవ్వడులు



జలతరంగిణి జలపాతం




తోటపల్లి జలపాతం

పొల్లూరు జలపాతం

ఆహా అనేలా..
లొట్టలేసి తినేలా..

అల్పాహారంలో ఇవి మన 'స్పెషల్' రుచులు
టిఫిన్ సెంటర్ల నుంచి ఏకంగా పెళ్లిళ్ల వరకూ ఇదో మెనూ
తెల్లవారుజాము నుంచే ఆయా దుకాణాల వద్ద రద్దీ
చౌక ధరల్లోనే లభ్యం 6



పాములేరు వాగు

సీతపల్లి వాగు

రంప జలపాతం

ఏజెన్సీ అందాలకు ఆభరణాలు జలపాతాలే..

(ఆంధ్రజ్యోతి-రంపచోడవరం/చింతూరు)

మన్యం ఫారెస్టుకు వెళ్లేవారి దృష్టంతా జలపాతాల జలకాలాటలపైనే ఉంటుంది. దట్టమైన అడవిలో విహరిస్తూనే ప్రధానంగా జలపాతాల సవ్వడిని ఆస్వాదించాలని ఆరాటపడతారు. ఇలాంటి వాటర్ ఫాల్స్ పేరు చెప్పగానే మొదట గుర్తొచ్చేది ఉమ్మడి తూర్పుగోదావరిలో జిల్లాలోని (ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా) రంప ఏజెన్సీనే. ఇక్కడ పారే వాగులన్నీ ఏదొక కొండ మీద నుంచి జాలువారుతూ పుట్టినవే. ఇందులో రంపచోడవరం మండలంలోని రంపజలపాతం, సీతపల్లి వాగు ఉండగా మారేడుమిల్లి మండలంలో జలతరంగిణి, అమృతధార, పాములేరు వాగులు ప్రధానం. ఆయా వాగుల జలపాతాల వద్ద స్నానాలు చేయడమంటే అందరికీ సరదానే. కార్తీక మాసంలో ఇక్కడకు విహార యాత్రికుల సందడి అధికంగా ఉంటుంది. రంపలో పురాతన శివాలయం ఎగువన ఒక జలపాతం ఉంది. మారేడుమిల్లి మండలంలో అటవీశాఖ ఆధ్వర్యంలో జలతరంగిణి, అమృతధార జలపాతాలు, పాములేరు వాగు టూరిస్టుల స్పాట్‌గా నడుస్తున్నాయి. అయితే యాత్రికులు ఈ ప్రాంతాలను సందర్శించే క్రమంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ఈ ప్రాంతాలు విషాదాన్ని మిగుల్చుతాయి.

పోదామా.. పొల్లూరు జలపాతానికి..

చింతూరు నుంచి 36 కిలోమీటర్ల దూరంలో పొల్లూరు జలపాతం ఉంది. చింతూరుకు 18 కిలోమీటర్ల దూరంలో సోకిలేరు వ్యూ పాయింటు ఉంది. చింతూరు నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రవేశాలతోపాటు శబరి, సీలేరు నదుల సంగమం చూడొచ్చు. చింతూరు నుంచి 30 కిలోమీటర్ల దూరంలో కూనవరం వద్ద గోదావరి ప్రవాహంలో శబరి, సీలేరు నదుల కలయిక చూడొచ్చు. అక్కడి నుంచి 22 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే పోచవరం... అక్కడి నుంచి 20 కిలోమీటర్ల దూరం బోటుపై ప్రయాణించి పాపికొండలు చేరుకోవచ్చు. ఇక పొల్లూరు జలపాతంతోపాటు సోకిలేరు వ్యూ పాయింటు వద్ద పర్యాటకులు అత్యంత జాగ్రత్తను వహించాలి. పొల్లూరు జలపాతం సందర్శనను ఇటీవలే తిరిగి ప్రారంభించారు.



కనుల విందు.. ధారపల్లి జలపాతం

(ఆంధ్రజ్యోతి-ప్రత్తిపాడు)

పచ్చటి చెట్ల మధ్య ఎత్తైన కొండల నుంచి జాలువారే జలపాతాలు... రిజర్వ్ ఫారెస్ట్‌లో ఈ ప్రకృతి అందాల నడుమ ఈ జలపాతాల్లో స్నానాలు ఆచరించడం ఓ మధురానుభూతి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట గిరిజన గ్రామ పంచాయతీ పరిధిలో ధారపల్లి జలపాతం ఉంది. ప్రత్తిపాడుకు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ జలపాతం మూడు నాలుగు పాయలుగా కొండపై నుంచి జాలువారుతుండడంతో స్నానాలు స్నానాలు చేసేందుకు సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. ఈ జలపాతం చేరుకోవాలంటే ప్రత్తిపాడు నుంచి ఉత్తరకంచి, పెద్దిపాలెం, కిత్తమూరి పేట నుంచి ధారపల్లి చేరుకుని కొండ ఎక్కాల్సిందే. జలపాతం దిగువన ఏనుగు బండ రాయిలొద్దులో నందీశ్వరుడు, శివలింగం ఉండడంతో సందర్శకులు కార్తీకమాసంలో ఇక్కడకు తరలివస్తారు. అలాగే ఎరకంపాలెంలో మరో జలపాతం ఉంది. ఇది శివలింగాన్ని అభిషేకిస్తూ కొండ నుంచి కిందకు జాలువారుతుండడంతో ఆ జలాల్లో స్నానాలు ఆచరించేందుకు భక్తులు తరలివస్తున్నారు. ఈ ప్రదేశం చేరుకోవడానికి ప్రత్తిపాడు నుంచి లంపకలోవ, రౌతుపాలెం, గోకవరం మీదుగా ఎరకంపాలెం కొండ ఎక్కాల్సిందే. ఈ కొండ దారి నిటారుగా ఉండడంతో ఈ మార్గంలో ఒకింత సాహసంతో నడవాలి. ప్రత్తిపాడు మండలంలోనే తోటపల్లి జలపాతం ఉంది. ప్రత్తిపాడుకు 20 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం తోటపల్లి కొండల్లో జాలువారుతుంది. ప్రత్తిపాడు, రాచపల్లి, ఒమ్మంగి, శరభవరం, శాంతి ఆశ్రమం, వెంకటనగరం మీదుగా తోటపల్లి గ్రామానికి కిలో మీటరు దూరంలో ఈ జలపాతం ఉంది.

ప్రశాంత వాతావరణంలో
ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావు
- పీవోలకు దిశానిర్దేశం



పీవోలకు దిశానిర్దేశం చేస్తున్న డీఆర్వో

అమలాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 5న జరిగే ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావు ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లాలో 22 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయా కేంద్రాలకు ప్రిసైడింగ్, ఇతర అధికారులకు తొలిదశ శిక్షణ ఇచ్చారు. డీఆర్వో మదన్మోహనరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారని, డిసెంబరు 5న పోలింగ్ నిర్వహించి 9వ తేదీన కాకినాడ జేఎన్‌టీయూలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నట్టు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం గురించి, తీసుకోవాల్సిన సామగ్రి గురించి వివరించారు. ఓటరు ధ్రువీకరణ నిమిత్తం ఓటరు ఐడీతో పాటు మరో పది కార్డుల్లో ఏదో ఒకటి ఒరిజినల్ చూపించి గుర్తింపును ధ్రువీకరించుకోవాలన్నారు. ఎడమచేతి చూపుడు వేలుపై ఇన్‌డేలిబుల్ ఇంక్ మార్కింగ్ గీత మాదిరిగా వేయాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ఓటింగ్ చేయాలని, మొదటి ప్రాధాన్యత ఇవ్వని పక్షంలో అతని ఓటు చెల్లుబాటు కాదన్నారు. ప్రిసైడింగ్ అధికారం మొత్తం పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తూ క్రమశిక్షణతో ఓటింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. ఓటింగ్ కంపార్టుమెంట్‌లో ఒన్‌ప్లస్ 4 అధికారుల సిటింగ్ ఏర్పాటు, ఓటర్ల ప్రవేశానికి, బయటకు వెళ్లేందుకు ద్వారాలు ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులు ఓటు వేయడానికి తోడుగా 18 ఏళ్లు నిండిన వారిని డిక్లరేషన్ తీసుకుని అనుమతించాలని రీసోర్స్ పర్సన్ మండపేట తహశీల్దార్ తేజేశ్వరరావు వివరించారు. టెండరు ఓట్లు, చాలెంజ్ ఓట్ల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో స్వీకరించిన 45 రకాల మెటీరియల్‌ను సజావుగా నింపుతూ మరలా రిసెప్షన్ సెంటర్‌లో అందజేయాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు డాక్టర్ వి.శివశంకరప్రసాద్, వివిధ శాఖలకు చెందిన పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు అమలాపురంలో ఉభయ తెలుగు రాష్ట్రాల
శెట్టిబలిజ కార్తీక వనసమారాధన

వివరాలు వెల్లడించిన మంత్రి సుభాష్

అమలాపురం టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఆదివారం అమలాపురం ఎత్తురోడ్డులోని శ్రీసత్తెమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో శెట్టిబలిజ కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నట్లు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. శెట్టిబలిజ సమారాధనను విజయవంతం చేయాలని సంఘీయులకు పిలుపునిచ్చారు. అమలాపురంలోని ఆయన స్వగృహం వద్ద శనివారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. యువత ఎటువంటి హంగామా చేయరాదని, సైలెన్సర్లు తీసి మోటారు సైకిళ్లు నడపరాదని ప్రధానంగా పోలీసులకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. కులాలను కలుపుకుంటూ ముందుకు సాగడంతో పాటు సంఘ అభివృద్ధికి పాటుపడడమే లక్ష్యంగా ఏటా వేలాదిమందితో కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నిర్వహించే వనసమారాధనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘ నేతలు వాసంశెట్టి సత్యం, మట్టపర్తి నాగేంద్ర, వాసంశెట్టి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో అప్పనపల్లి కిటకిట

కార్తీక శనివారం కావడంతో తరలివచ్చిన భక్తులు



ఆలయ ప్రాంగణంలో భక్తులు

మామిడికుదురు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం భక్తుల కోలాహలంతో కిటకిటలాడింది. కార్తీకమాస శనివారం సందర్భంగా స్వామివారికి నిత్య హారతితో పాటు సుప్రభాత సేవను పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అర్చకులు స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని 6500 మంది భక్తులు దర్శించుకుని, 4వేల మంది స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,91,480 ఆదాయంగా సమకూరిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలియచేశారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



దీపకాంతిలో స్వామివారు



సందడిగా అంతర్వేది

అంతర్వేది, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఆలయానికి కార్తీకమాసం శనివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేశారు. స్వామివారి నిత్యాభిషేకం, సుదర్శన హోమాల్లో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన భక్తులు నరసింహస్వామి దర్శనం కోసం బారులు తీరారు. స్వామివారి దర్శనం అనంతరం నిత్యాన్నదానంలో ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం లైట్‌హౌస్, బీచ్, సాగర సంగమం ప్రదేశాల్లో భక్తులు, పర్యాటకులు సందడి చేశారు. తీరం వెంబడి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కార్తీక వన భోజనాలు చేశారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

వాడపల్లికి పోటెత్తిన
భక్తజనం 6లో



రాష్ట్ర హైవేగా సామర్లకోట-వేమగిరి
కెనాల్ రోడ్డు
కేంద్ర ప్రభుత్వ గుర్తింపు 7లో

ఓఎన్జీసీ వెల్ సైట్‌లో వైట్ ఆయిల్ చోరీ
వివరాలు..7లో

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి
వివరాలు..7లో

'రాష్ట్రాన్ని యూనిట్‌గా చేసుకుని రిజర్వేషన్
అమలు చేయాలి'



మాట్లాడుతున్న తెన్నేటి కిశోర్‌మాదిగ

అమలాపురం టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిశోర్ మాదిగ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ రిపోర్టు ఆధారంగా ఎస్సీ కులాల వర్గీకరణ రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని చేయాలని కోరారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో శనివారం జిల్లాశాఖ అధ్యక్షుడు ఈతకోట రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కిశోర్‌మాదిగ మాట్లాడుతూ జిల్లాను యూనిట్‌గా తీసుకుని ఎస్సీ వర్గీకరణ చేపట్టడం వల్ల ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల్లో మాదిగలు నష్టపోతారని వివరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొడమంచిలి సాయికుమార్, రాష్ట్ర కార్యదర్శి ఉందుర్తి సత్యనారాయణ, నామవరపు సత్యనారాయణ, తొత్తరమూడి ఆనంద్, ఈతకోట అనిల్, కొడమంచిలి తాతాజీ, బండి మురళీకృష్ణ, నవుంద్రు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ చిట్టి పెసరట్టు తయారీ





ఆహా అనేలా.. లొట్టలేసి తినేలా

మన టిఫిన్స్.. అదుర్స్

ఆదివారం కదా.. ఉదయం లేస్తూనే ఏంటి ఈరోజు స్పెషల్ అంటారు పిల్లల నుంచి పెద్దల వరకూ. మిగతా రోజుల్లో ఇడ్లీనో, ఉప్మానో సరిపెట్టుకుంటాంగానీ.. ఈరోజు మాత్రం కచ్చితంగా బ్రేక్‌ఫాస్ట్ అదిరిపోవాల్సిందేనంటూ పట్టుబడతారు. దీంతో ఇంట్లో టిఫిన్లకు ఆరోజు సెలవిచ్చి బయట రుచుల కోసం వేటాడతారు మరికొందరు. ఎక్కడ ఏది ఫేమస్సో సెర్చ్ చేస్తారు ఇంకొందరు. ఇక బయట ప్రాంతాల నుంచి వచ్చేవారైతే వెళ్లే దారిలో ఏ అల్పాహారం బాగుంటుందో ముందే ఆరా తీస్తారు. అప్పుడు అనేక అల్పాహార హోటళ్లు గుర్తుకువస్తాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇలాంటి హోటళ్లకు కొదవ లేదు. రావులపాలెంలో అన్‌లిమిటెడ్ అల్పాహార రుచులు ఫేమస్ గురూ అంటారొకరు. ఇక కోనసీమ వెళితే అంబాజీపేట పొట్టిక్కలు తినకుండా వెళ్లగలమా అని మరో మిత్రుడు సవాల్ విసురుతాడు. కాకినాడ వెళితే చిట్టి పెసరట్టులు రుచి చూడకుండా రావొద్దని హెచ్చరిక జారీ చేస్తాడు మరో హితుడు. వైజాగ్ వెళుతుంటే తేటగుంటలో తప్పకుండా ఆగు.. ఉప్మా పెసరట్టు తినేసి పో అంటాడు మరొకాయన. సరదాగా ఆ రుచుల కబుర్లు చెప్పుకుందామా..

పెసరట్టు..అదిరేట్టు..

కాకినాడ చిట్టి పెసరట్టు టేస్టే వేరబ్బా

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చిట్టి పెసరట్టు అనే పేరు వినగానే ముందుగా గుర్తొచ్చేది కాకినాడ. పెద్ద మార్కెట్ పెద్ద శివాలయం వద్ద అమ్మే ఈ చిట్టి పెసరట్టు టేస్ట్ మామూలుగా ఉండదు. 50 ఏళ్ల నుంచి ఈ పెసరట్టు రుచిని పంచుతున్నారు.. సాధారణంగా హోటల్స్‌లో దొరికే పెసరట్టు టేస్ట్‌కంటే ఇక్కడ దొరికే పెసరట్టు టేస్ట్ అద్భుతంగా ఉంటుందని అక్కడ తిన్న ప్రతి ఒక్కరూ చెప్తారు. దీనికి కారణం పొట్టు పెసరపప్పును గ్రైండర్‌లో రుబ్బి కట్టెల పొయ్యిపై కాల్చడం వల్లే ఈ రుచి వస్తుందని హోటల్ నిర్వాహకులు చెబుతున్నారు. పెసరట్టు ఉప్మాతో పాటు కారంపొడి వేసుకుని తింటే ఆ రుచి వేరని అందుకే సుదూర ప్రాంతాల నుంచి కూడా పెసరట్ల కోసం మాత్రమే ఇక్కడికి వచ్చి తిని వెళుతుంటారని చాలా మంది చెబుతున్నారు. రెండు పెసరట్లు ఉప్మా ధర రూ.30.

సినీ ప్రముఖులు రుచిచూసిన అట్టు

అగ్ర కథానాయకులు ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావుతోపాటు చిరంజీవి, పవన్‌కల్యాణ్, అల్లుఅర్జున్ వరకు కాకినాడ చిట్టి పెసరట్టును రుచి చూసినవారే. గతంలో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాకినాడ పర్యటనలో భాగంగా చిట్టి పెసరట్టును రుచి చూశారని హోటల్ నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే అక్కినేని నాగేశ్వరరావు పరిసర ప్రాంతాల షూటింగ్‌లోకి వచ్చినప్పుడు రుచి చూశారు. చిరంజీవి, పవన్‌కల్యాణ్ కూడా షూటింగ్ సందర్భంగా కాకినాడ విచ్చేస్తున్నప్పుడు రుచి చూసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మధ్యకాలంలో పుష్ప-2 షూటింగ్‌కి వచ్చిన అల్లు అర్జున్ కూడా చిట్టి పెసరట్లను ఆరగించారు.

తేటగుంట నేతి పెసరట్టు

మళ్లీ మళ్లీ తినేటట్టు..

తుని రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉప్మా పెసరట్లు చాలాచోట్ల అమ్ముతుంటారు. కానీ కొన్ని చోట్లే ఎక్కువ ఫేమస్ అవుతుంటాయి.. ఇప్పుడు అలాంటి ఫేమస్ పెసరట్టు ఉప్మా గురించి మీకు చెప్పబోతున్నాం.. రాజమహేంద్రవరం-విశాఖపట్నం జాతీయ రహదారిపై అన్నవరం దాటిన తర్వాత తేటగుంట అనే ఒక గ్రామ కూడలి వస్తుంది. ఇక్కడ ఎప్పుడైనా పెసరట్టు ఉప్మా ట్రై చేశారా? లేకపోతే ఈసారి ట్రై చేయండి.. ఒట్టు.. అదుర్స్ ఈ పెసరట్టు.. ఇక్కడ పెసరట్టు ఉప్మా ఎంత ఫేమస్ అంటే ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఒక్క షాపు కూడా ఖాళీ ఉండదు.. ముఖ్యంగా రెండు మూడు హోటల్స్ దగ్గర అయితే ప్లేట్‌లోకి పెసరట్టు ఉప్మా ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తుంటారు.. సలసల కాగే పెనం మీద పచ్చని పెసర రుబ్బును గరిటెతో తీసి పెనం మీద వేసి దానిపై సన్నగా తరిగిన ఉల్లిపాయలు, జీలకర్ర, జీడిపప్పు వేసి కారం పొడి జల్లి, నెయ్యి దట్టించి కాల్చే ఈ పెసరట్టును చూస్తుంటేనే నోట్లో నీరు సుడులు తిరుగుతుంది.. అంత కమ్మగా ఉంటుంది ఈ ఉప్మా పెసరట్టు.. ఇక ఈ పెసరట్టు ఉప్మాలోకి వేసే చట్నీలు కూడా ఇక్కడ స్పెషలే.. ముఖ్యంగా దబ్బకాయ చట్నీ, అల్లం చట్నీలతో పెసరట్టు, ఉప్మాను లొట్టలేసుకుని మరీ తింటుంటారు. దుకాణాలు చిన్నవే అయినా ఇక్కడ ఆగే కార్లు, బైక్‌ల సంఖ్య చాలా పెద్దది. అన్ని దుకాణాల్లో కలిపి రెండు, మూడు వేల పెసరట్టు ఉప్మాలు సేల్ అయిపోతాయి.. వీళ్లు స్వయంగా పొలాలకు వెళ్లి పెసలు తెచ్చుకుంటారు. వాటిని ఒక ప్రత్యేక పద్ధతిలో శుభ్రం చేస్తారు. కొన్ని చోట్ల రోటిలోనే రుబ్బుతారు. నెయ్యిని కూడా వీరు సొంతంగానే తయారు చేసుకుంటారు. సుమారు 60 ఏళ్ల నుంచి ఇక్కడ టిఫిన్ బండ్లు ఉండేవి.. కాకపోతే 20 ఏళ్ల నుంచి ఉప్మా పెసరట్టు బాగా ఫేమస్ అయ్యి.. తేటగుంట పేరునే మార్చేశాయి. అందుకే ఇప్పుడు రాజమహేంద్రవరం-విశాఖపట్నం జాతీయ రహదారిపై ప్రయాణించే చాలామంది ప్రయాణికులు 'తేటగుంట దగ్గర ఆపండి.. ఉప్మా పెసరట్టు తినిపోదాం'.. అంటున్నారు..



అంబాజీపేట పొట్టిక్కలు



తేటగుంట పెసరట్టు



కాకినాడ చిట్టి పెసరట్టు

భలే..భలే పొట్టిక్కలు



అంబాజీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట పేరు చెప్పగానే అందరికీ గుర్తుకువచ్చేది పొట్టిక్కలు. పెద్ద హోటల్ నుంచి చిన్న హోటల్స్ వరకు టిఫిన్ అడిగితే ముందుగా పొట్టిక్కలు చెప్పి తరువాతే మిగిలినవి చెబుతుంటారు. ఇడ్లీ మాదిరిగానే ఉండే పొట్టిక్కలలో పనస ఆకుల నుంచి వచ్చే పత్రహరితం, సువాసనతో పొట్టిక్కలు మంచి రుచికరంగా ఉంటాయి. వీటి తయారీలోనూ రుచిలోను వాటికి ఉన్న ప్రాముఖ్యం అటువంటిది. అంబాజీపేటలోని బంధువుల ఇళ్లకు వచ్చినవారు, ఇతర ప్రాంతాల నుంచి ఈ ప్రాంతానికి వచ్చే వారు, సినీ పరిశ్రమకు చెందినవారు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు అంబాజీపేట మీదుగా వెళితే కచ్చితంగా అంబాజీపేట పొట్టిక్కలను రుచిచూసి మరీ వెళతారు. పొట్టిక్కలు ప్రస్తుతం విందులు, వినోదాలలోను ప్రధాన అల్పాహారంగా చోటు దక్కించుకుంది..

పోషకాలు మెండు..

పనస ఆకు శాస్త్రీయ నామం ఆర్టోకార్పస్ ఇంటిగ్రిఫోలియా. దీనిలో ఈదర్, ఎక్స్‌ట్రాస్ట్, అల్బుమినాయిడ్స్ డైజేషన్ కార్బోహైడ్రేట్స్ ఫైబర్ సైనోమెట్రో క్లోరిన్ క్రిష్టలాయిడ్‌లో ఉంటాయి. పొట్టిక్కలు తయారు చేసేటప్పుడు పనసాకుల నుంచి వచ్చిన ఆవిరితో పత్రహరితం పోషకాలు పొట్టిక్కలోనికి చేరుతాయి. ఈ పొట్టిక్కలు తినడం ద్వారా సులువుగా జీర్ణమవుతుంది.

ప్రముఖులు మెచ్చిన పొట్టిక్కలు

సినీనటుడు తనికెళ్ల భరణి అంబాజీపేటలోని గణపతి టిఫిన్స్ సెంటర్‌కు వెళ్లి మరీ పొట్టిక్కలు తినివెళ్లారు. అలాగే దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి అంబాజీపేట వచ్చినప్పుడల్లా పొట్టిక్కలు తినేవారు. అలాగే మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఈ ప్రాంతంలో పొట్టిక్కలు ఆరగించేవారు.



ఇలా తయారు చేస్తారు.

పనసచెట్టు ఆకులను కొబ్బరి ఈనెల సహాయంతో చిన్న చిన్న బుట్టలుగా అల్లుతారు. ఆ బుట్టలను నీటిలో శుభ్రపరచి ఇడ్లీ పిండి (మినప పిండి, ఇడ్లీరవ్వ)తో నింపుతారు. పిండితో నింపిన బుట్టలను ఇడ్లీ పాత్రలో పెట్టి ఆవిరితో ఉడికిస్తారు. వేడివేడి పొట్టిక్కలు తయారైనట్టే. ఉడికిన పొట్టిక్కలను బుట్టలో వలిచి వేడివేడిగా వడ్డిస్తారు. కొబ్బరి చట్నీ, ముంబై చట్నీ, దబ్బకాయ చట్నీతోపాటు కారంపొడి, నెయ్యి కాంబినేషన్‌తో తింటే ఆ రుచే వేరు. సుమారు 65 ఏళ్ల పైబడి అంబాజీపేటలో పొట్టిక్కలను తయారు చేస్తున్నారు. ఇప్పటికీ అల్పాహార విందులో పొట్టిక్క హవా కొనసాగుతూనే ఉంది. గతంలో రూపాయి నుంచి పొట్టిక్క అమ్మకం ప్రారంభించి నేడు ఒక్క పొట్టిక్క ఖరీదు రూ.10 పైబడి అమ్ముతున్నారు.

కార్తీకంలో లక్ష మార్కు దాటిన వ్రతాలు





వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

అన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం సత్యదేవుడి సన్నిధిలో క్రోధి నామసంవత్సరం కార్తీక మాసంలో భక్తులు ఆచరించిన వ్రతాల సంఖ్య శనివారంతో లక్ష మార్కు దాటి 1,02,561కి చేరాయి. కార్తీక మాసం ముగిసే నాటికి మరో 40వేలవ్రతాలు జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం 5,823 వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.60 లక్షల ఆదాయం సమకూరింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సత్యదేవా నిత్యాన్నదాన పథకం ద్వారా 20వేల మందికి ఉచిత అన్నదాన పథకం ద్వారా పులిహోర, దద్ధోజన ప్రసాదం అందజేశారు.

సత్యదేవుడికి జన్మ నక్షత్ర పూజలు

కోరిన కోర్కెలు తీర్చే కలియుగదైవం సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా శనివారం ప్రధానాలయంలో మూలవరులకు ప్రత్యేకపూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వేకువజామున 12.30కి స్వామి అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేశారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు అనంతరం మూలవరులను పంచామృతాలతో అభిషేకం చేశారు. నూతన పట్టువస్త్రాలు ధరింపచేసి సుగంధభరిత పుష్పాలతో అలంకరించి అనంతరం సర్వదర్శనాలకు అనుమతించారు.

దీక్షలు విరమించిన సత్యదీక్షాపరులు

27రోజులు నియమనిష్టలతో సత్యదీక్షలు చేపట్టిన దీక్షాపరులు శనివారం దీక్షలను విరమించారు. వార్షిక కల్యాణ మండపం వద్ద అర్చకస్వాములు సత్యదీక్షాపరుల నుంచి ఇరుముడిలను స్వీకరించారు. అనంతరం దీక్షాపరులు కల్యాణవేదిక ప్రక్కనే ఉన్న హోమగుండంలో టెంకాయి, ఇతర ద్రవ్యాలను అర్పించారు. స్వామిని దర్శించుకుని దీక్షాపరులందరికీ ఉచిత సామూహిక సత్యనారాయణ స్వామివ్రతాల్లో పాల్గొన్నారు.

భక్తవత్సల.. గోవింద

- వాడపల్లి వేంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.46.01లక్షలు





వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామి వారిని వివిధరకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధుల్లో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఆదాయం రూ.46.01లక్షలు లభించినట్టు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

8 మంది నూతన జంటలకు

పట్టుచీర, బంగారు చెవిదిద్దులు



పట్టుచీర, బంగారు చెవిదిద్దులు అందజేస్తున్న ఎన్ఆర్ఐలు

అన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యగిరికొండపై ఉన్న ఉచిత కల్యాణమండపాల్లో శుక్రవారం వివాహం చేసుకున్న 8మంది జంటలకు ఇద్దరు ఎన్ఆర్ఐ దంపతులు రూ.1.50లక్షలు విలువ చొప్పున బహుమతులు ఉచితంగా అందజేశారు. చికాగోకు చెందిన గోపిశెట్టి నాగజ, చంద్రశేఖర్ దంపతులు, గెడ్డం సూర్య సత్యదుర్గ దంపతులు వీటిని అందజేశారు. ఒక్కొక్కరికి పట్టుచీర, రెండుగ్రాముల బంగారు చెవిదిద్దులు, రూ.వెయ్యి నగదు అందజేశారు.

విద్యాభివృద్ధికి క్రీడలు దోహదం

జడ్పీ సీఈవో లక్ష్మణరావు... రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం





రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ సీఈవో లక్ష్మణరావు, మొదటిరోజు విజేతలు

కాకినాడ అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి క్రీడలు దోహదం చేస్తాయని జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. శనివారం పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలను కాకినాడ డీఎస్ఏ మైదానంలో లక్ష్మణరావు ప్రారంభించారు. అండర్-17 విభాగంలో నిర్వహిస్తున్న పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 16మంది క్రీడాకారులు హాజరయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. రెండ్రోజులు నిర్వహించే పోటీల్లో విజేతలను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు నాగేంద్రకుమార్, సానా సతీష్ ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, రమణరాజు, లక్ష్మణ్, పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కె.నూకరాజుపాల్గొన్నారు.

మొదటి రోజు విజేతలు వీరే

అనంతపురంపై గుంటూరు 10.0, చిత్తూరుపై శ్రీకాకుళం 20.0, కర్నూలుపై తూర్పుగోదావరి 23.0, విశాఖపై ప్రకాశం 15.0 స్కోరుతో గెలుపొంది సెమీ ఫైనల్‌కి చేరాయి.

స్వగ్రామానికి చేరుకున్న కువైట్ బాధిత మహిళ

మంత్రులు, జిల్లా అధికారులకు కుమారి కుటుంబం కృతజ్ఞతలు



యల్లమిల్లిలోని కుటుంబ సభ్యులతో గారా కుమారి

గండేపల్లి, నవంబరు23(ఆంధ్రజ్యోతి):బతుకు తెరువు కోసం కువైట్ వెళ్లి అక్కడ చిత్ర హింసలకు గురైన కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన మహిళ గారా కుమారి రాష్ట్ర ప్రభుత్వం చొరవతో శనివారం స్వగ్రామానికి చేరుకుంది. భర్త చనిపోయి ఇల్లు గడవడం కష్టమైన పరిస్థితుల్లో పిల్లల పోషణ, భవిష్యత్తు కోసం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఏజెంట్ ఎం.సుధాకర్ ద్వారా గత మే నెల ఒకటో తేదీన ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లింది. అయితే ఆమె పనిచేస్తున్న చోట యజమాని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఉపాధి కోసం విదేశాల్లో నానా అవస్థలు పడుతున్న వారిని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న ఆమె పడుతున్న అవస్థలపై వీడియోగా చిత్రీకరించి సోదరుడు కర్రిపోతు సూర్యచంద్ర ద్వారా వారికి పంపింది. ఆమె దీన పరిస్థితికి చలించిన మంత్రులు కువైట్‌లోని భారత రాయభార కార్యాలయంతో చర్చించి ఆమె తిరిగి స్వదేశానికి వచ్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. మంత్రుల చొరవతో కుమారి కువైట్ నుంచి విమానంలో హైదరాబాద్ చేరుకుని శుక్రవారం అర్ధరాత్రికి సొంతూరు యల్లమిల్లిలోని ఇంటికి చేరుకుంది. దీంతో ఆమె కోసం ఎదురుచూసిన తల్లిదండ్రులు, పిల్లలు సంతోషం వ్యక్తం చేశారు. తమ తల్లిని సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు చొరవ చూపిన మంత్రులు, జిల్లా అధికార యంత్రానికి గారా కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రుల ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

- ఓటర్లు 2,61,728
- వచ్చే నెల 9వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ
- కొత్తగా ఓటు నమోదుకు అవకాశం
- వచ్చే నెల 30న తుది జాబితా ప్రచురణ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను శనివారం ప్రచురించారు. తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఓటునమోదు అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రచురించారు. ఇప్పటివరకు 2,61,728 దరఖాస్తులు రాగా వాటిని జాబితాలో నమోదు చేశారు. దీనిలో పురుషులు 1,54,769మంది, మహిళలు 1,06,922 మంది ఉన్నారు. జిల్లాల వారిగా పరిశీలిస్తే కాకినాడ జిల్లాలో 55958, తూర్పుగోదావరి జిల్లాలో 51624, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 53726, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3336, ఏలూరు జిల్లాలో 36268, పశ్చిమగోదావరి జిల్లాలో 60816 మందిఓటర్లుగా నమోదయ్యాయి. ఈజాబితాను ఆరు జిల్లాల్లో ఉన్న కలెక్టరేట్లు, ఆర్డీవో కార్యాలయాలు, సబ్‌కలెక్టర్ కార్యాలయాలు, తహసీల్దార్ల కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు, ప్రదర్శిస్తున్నారు. ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వచ్చే నెల 9వ తేదీ వరకు తెలపవచ్చును. అలాగే వచ్చేనెల 9వరకు కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు చేయవచ్చును. వచ్చేనెల 30వ తేదీన తుది జాబితా ప్రచురిస్తారు. ఇతర వివరాలకు టోల్‌ఫ్రీ నెంబరుకు 1950 సంప్రదించాలి.

జొన్నాడ ఇసుక ర్యాంపులో సినిమా షూటింగ్



హీరో శ్రీనివాస్‌ను కలిసిన అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ఆలమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ ఇసుక ర్యాంపులో బెల్లంకొండ సురేష్ తనయుడుశ్రీనివాస్ హీరోగా నటిస్తున్న చిత్రానికి సంబంధించి చిత్రీకరణ జరిగింది. ఇసుకర్యాంపులో శనివారం సాయంత్రం జరిగిన షూటింగ్‌లో హీరో బెల్లంకొండ శ్రీనివాస్‌తో పాటు చిత్ర యూనిట్ పాల్గొంది. ఈసందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేసి హీరో శ్రీనివాస్‌తో కొద్దిసేపు ముచ్చటించారు. హీరోగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే ఆయనను అభినందించారు.

సత్యదేవుని సన్నిధిలో లక్ష్మణ్ పూజలు



అన్నవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడిని శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కోవ లక్ష్మణ్ కుటుంబసభ్యులతో దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు ముందడుగు

ఒడిస్సా టూ తెలంగాణ వయా ఆంధ్రప్రదేశ్ లైన్

భూ సేకరణ సర్వే టెండర్లకు ఆహ్వానం

173.61 కిలోమీటర్లకు రూ.3,592 కోట్ల అంచనా వ్యయం





భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాండురంగాపురం రైల్వేలైన్, డివిజను కేంద్రమైన చింతూరు

చింతూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా జునాఘర్ నుంచి తెలంగాణ రాష్ట్రం భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాండురంగాపురం వరకు కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. మన రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజను మీదుగా సాగే ఈ లైన్ ప్రధానమంత్రి గతిశెట్టి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ఐదేళ్లలో పూర్తి చేయాలన్న తలంపుతో కేంద్రం చర్యలు వేగవంతం చేసింది. 173.6 కిలోమీటర్ల మేర సాగనున్న బ్రాడ్‌గేజ్ రైల్వేలైన్ ఏర్పాటుకు కేంద్రం ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ జారి చేసింది. అంచనా వ్యయంగా రూ.3,592 కోట్లుగా నిర్ధారించారు. ఆగస్టు 10న కేంద్ర కేబినెట్ ఆమోదం కూడా పొందింది. మూడు రాష్ట్రాలను కలిపే ఈ లైన్ నిర్మాణాన్ని రైల్వే శాఖ ప్రత్యేక ప్రాజెక్టుగా పరిగణించింది. వెనువెంటనే భూసేకరణ సర్వేకోసం ఓ ప్రత్యే క నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో భూ సేకరణ సర్వే పనుల నిమిత్తం ఈనెల 20 నుంచి డిసెంబరు 4 వరకు దరఖాస్తుల గడువుగా పేర్కొంది. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే 2008 రైల్వే భూసేకరణ చట్టం అనుసరించి భూములు సేకరించనున్నారు. ఆమేరకు అల్లూరి సీతారామ రాజుజిల్లా చింతూరు డివిజన్ పరిధిలో 85.5 కిలోమీటర్లు, ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లాలో 68.3కిలోమీటర్లు, తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 19.7 కిలోమీటర్ల మేర ఈ కొత్త లైన్ సాగనుంది. దీంతో మన రాష్ట్రంతోపాటు చత్తీస్‌గఢ్, ఒడిస్సా, తెలంగాణ ప్రజలకు ప్రయాణ, రవాణ సౌకర్యం మరింత సులభతరంకానుంది. అదేదశలో విద్యా, వ్యాపార, పర్యాటక, ఆరోగ్య సంరక్షణలతోపాటు బహుళ వ్యాపారరంగాలు అభివృద్ధి అయ్యే అవకాశం ఉంది. ఇక చింతూరు డివిజన్ విషయానికొస్తే చింతూరు మండలంలోని సింగన్నగూడెం, కూనవరం మండలంలోని కూటూరుగట్టు, పలూరు మీదుగా ఎటపాక మండలం నందిగామ చేరుకుంటుంది. అనంతరం తెలంగాణలోని భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రా చలం మీదుగా పాండురంగాపురం చేరుకోనుంది.

సామర్లకోట-వేమగిరి కెనాల్ రోడ్డుకు మహర్దశ

రాష్ట్ర హైవేగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం

అభివృద్ధికి సంకేతాలు... 62 కిలోమీటర్ల మేర అభివృద్ధి

నాలుగు నియోజకవర్గాలతో పెనవేసుకున్న రహదారి

నెరవేరనున్న దశాబ్దాల కల



వేమగిరి-సామర్లకోట కెనాల్‌రోడ్డు ద్వారపూడి-అనపర్తి మధ్య రోడ్డు (ఊహాచిత్రం)

అనపర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న వేమగిరి సామర్లకోట రహదారికి మహర్దశ పట్టనుంది. వేమగిరి నుంచి సామర్లకోట వరకు నాలుగు నియోజకవర్గాలను కలుపుతూ 62 కిలో మీటర్లమేర ఉన్న ఈ రహదారి గత పది పదిహేను సంవత్సరాలుగా దుర్భరంగా మారి కనీసం ద్విచక్ర వాహనంతో కూడా ప్రయాణం చేయలేనిస్థితికి చేరుకుంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డు అభివృద్ధి మాత్రం అందని ద్రాక్షగా మారింది. ఈరోడ్డు పరిధిలో నాలుగు నియోజక వర్గాలు ఉన్నప్పటికీ అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఒక్కరే ఈ రోడ్డు అభివృద్ధి కోసం నాటి నుంచి నేటి వరకు కృషిచేస్తూ వస్తున్నారు. చివరకు ఆయన కష్టం ఫలించడంతో కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్డును రాష్ట్ర హైవేగా మార్పుచేస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతులు మంజూరు చేసింది. ఈ రోడ్డును రాష్ట్ర హైవేగా మార్పు చేయడంతో కాకినాడ పోర్టుకు మూడో ప్రత్నామ్నా య మార్గం ఏర్పడినట్లయింది. వేమగిరి నేషనల్ హైవే 16నుంచి సామర్లకోట నేషనల్ హైవే 216కు అనుసంధానం చేస్తూ ఈ రహదారి నిర్మాణం కానుంది. దీంతో కాకినాడ పోర్టుకు మరో దగ్గర దారి ఏర్పాటు కానుంది. ఇప్పటివరకు రోడ్లు భవనాల శాఖ ఆధీనంలో ఉన్న ఈ రోడ్డును స్టేట్ నేషనల్ హైవేగా మార్పుచేయడంతో రహదారి నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు మంజూరు కానున్నాయి. ఇప్పటికే ఈ రహదారి విస్తరణ పనులకు గాను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మూడు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రహదారి విస్తరణకు పథక రచన చేయడమే కాకుం డా 235 కోట్ల ప్రపంచ బ్యాంక్ నిధులను కూడా సమకూర్చి ట్రాన్స్ స్ట్రాయ్ కంపెనీ ద్వారా పనులను చేపట్టింది. అని వార్య కారణాలవల్ల ట్రాన్స్ స్ట్రాయ్ పూర్తిగా పనులు చేయకుండానే వెను దిరిగింది. 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చేసరికి అభివృద్ధి పనులు అస్తవ్యస్థంగా ఉండటం రోడ్డుపై పెద్ద పెద్ద కుంతలు ఏర్పడి అనేక ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సుమారు 9కోట్ల నిధులతో ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. అదే విధంగా అసంపూర్తిగా ఉన్న కల్వర్టులను పూర్తి చేసేందుకు మరో రెండున్నర కోట్లతో నిర్మాణాలు చేయించారు. ఈ రోడ్డు అభివృద్ధికి ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో అధికార మార్పు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి వరకు ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నాయకుడు డాక్టర్ సత్తి సూర్య నారాయణరెడ్డి రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ పార్టీ శ్రేణులతో కలిసి సతీసమే తంగా పది కిలో మీటర్ల మేర పాదయాత్ర కూడా నిర్వహించారు. చివరకు ఆయన 2019లో ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో ఈ రోడ్డుకు మోక్షం లభిస్తుందని ఆశించిన ప్రజలకు ఐదేళ్లపాటు ఆశా భంగమే కలిగింది. చివరకు వైసీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంలో కూడా విఫలం కావడం ఆయన 2024 ఎన్నికలలో ఓట మికి కారణంగా నిలిచింది. వైసీపీ అధికారంలో ఉన్న తరుణంలో ప్రతిపక్ష నేతగా ఉన్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాత్రం రోడ్డు అభివృద్ధిపై నిత్యం పోరాటం చేస్తూనే ఉండేవారు. చివరకు మరమ్మ తులైనా చేయించాలని డిమాండ్ చేస్తూ అనేక పర్యాయాలు నిరశన కార్యక్రమాలు నిర్వహించారు. చివరకు ఈ ఉద్యమంపైనా పోలీసులు కేసు నమోదు చేసిన సందర్భం ఉంది. 2024 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా కెనాల్‌రోడ్డు అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇస్తూ రంగంలోకి దిగి ఇద్దరూ విజయం సాధించారు. దీంతో రోడ్డు అభివృద్ధిపై ఇరువురు నేతలు దృష్టిపెట్టారు. అన్ని టికన్నా ముందుగా రహదారి అభివృద్ధికి రోడ్డుస్థాయి పెంపు ఎంతైనా అవసరమని గుర్తించి ఈ 62 కిలో మీటర్ల మేర కెనాల్ రోడ్డును రెండు జాతీయ రహదారులకు అనుస ంధానం చేస్తూ రాష్ట్ర హైవేగా మార్పు చేయాలని ముఖ్య మంత్రి చంద్రబాబును కోరారు. దీంతో ముఖ్యమంత్రి జులై నెలలో కెనాల్ రోడ్డును రాష్ట్ర హైవేగా మార్పుచేయాలని కోరుతూ కేంద్రఉపరితల, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కారీకి లేఖను రాశారు. ఈలేఖ ప్రాధాన్యతను గుర్తించిన కేంద్రమంత్రి ఈ రోడ్డును స్టేట్ హైవేగా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో రోడ్డు అభివృద్ధికి సుగమమైంది.

రోడ్డును అభివృద్ధి చేస్తే రవాణా, టూరిజం అభివృద్ధి

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



ప్రస్తుతం 30అడుగుల వెడల్పు ఉన్న ఈ రహదారిని కేంద్ర ప్రభుత్వం స్టేట్‌హైవేగా మార్పుచేస్తూ ఉత్తర్వులు జారీచేయడం ఆనందం ఉంది. రోడ్డు అభివృద్ధికి మార్గం సుగమమైంది. ఎన్నో సందర్భాలలో ఈ రోడ్డుపై జరుగుతున్న అనేక ప్రమాదాలను చూసి మనసు చలించి పోయేది. ఈ రోడ్డును అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముం దుకు సాగుతున్నాను. ప్రస్తుతం ఉన్న రోడ్డును అభివృద్ధిచేయడం, నాలుగులైన్లరోడ్డుగా అభివృద్ధి చేయడం వంటి మూడు ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి అందించాం. ఈ రోడ్డు అభివృద్ధి కోసం నాతోపాటు అనేక మంది పార్టీ శ్రేణులు అనేక పోరాటాలు చేశారు. ఇది అందరి విజయంగా భావిస్తున్నాను. త్వరితగతిన రోడ్డుకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తాను.

కెనాల్ రోడ్డు పనులకు ముందడుగు

మండపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ప్రస్తుతం మూడుజిల్లాలకు సంబంధించిన వేమగిరి, సామర్లకోట మధ్యవున్న కెనాల్‌రోడ్డుకు ఎట్ట కేలకు మోక్షం కలగనుంది. వేమగిరి, కడియం, ద్వారపూడి అనపర్తి మీదుగా వున్న కెరాల్‌రోడ్డును కేంద్రప్రభుత్వం స్టేట్‌హైవేగా గుర్తించింది. ఈమే రకు ప్రభుత్వం శుక్రవారం అనుమతులు జారీ చేసిందని అధికారులు వెల్లడించారు. ఈ రహదారి పునఃనిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కానున్నాయి. ఈ కెనాల్ రోడ్డు వెంబడి సుమారు 60గ్రామాల వరకు ఉన్నాయి. ఈరోడ్డుకు సంబంధించి ఉమ్మడిజిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరంరూరల్, మండపేట, అనపర్తి, పెద్దాపురం, రామచంద్రపురం, యానాం ప్రాంత ప్రజలకు రోడ్డు ఎంతో ఉపయోగపడుతుంది. రాజమహేంద్రవరం నుంచి సామర్లకోట మీదుగా కాకినాడకు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. వేమగిరి నుంచి సామర్లకోట మధ్యవున్న కెనాల్ రోడ్డు 62 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈరోడ్డును స్టేట్‌హైవేగా మారుతూ కేంద్ర ఉపరితల రవాణాశాఖనుంచి ఏపీ ప్రభుత్వానికి అనుమతులు ఇచ్చింది. కెనాల్ వెంట రోడ్డుపక్క వున్న ఆక్రమణలు తొలగించటంతోపాటు రోడ్డువెడల్పు పనులు చేపట్టాలి.

గోకవరం ప్రభుత్వాసుపత్రిలో

బాలింత మృతి

● బిడ్డకు జన్మనిచ్చి వెంటనే మృతి



అంబులెన్స్‌లో వెంకటలక్ష్మి మృతదేహం

గోకవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లిన నిండు గర్భిణి శస్త్ర చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గోక వరం ప్రభుత్వాసుపత్రిలో శనివారం చోటు చేసు కుంది. వైద్యుల నిర్లక్ష్యమో, జరిగిన తప్పిదమో తెలియదుగాని ఆ గర్భిణి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చి ఈ లోకాన్ని విడిచింది. వివరాల్లోకి వెళితే.. రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రా మానికి చెందిన బీరబోయిన వెంకటలక్ష్మి (34) అటవీశాఖలో గోకవరం రాణాదారుగా పనిచేస్తో ంది. ఆమె భర్త దుర్గాప్రసాద్ ఫారెస్ట్ సెక్షన్ అధి కారిగా పనిచేస్తున్నారు. వెంకటలక్ష్మి గర్భిణి అని తెలిసినప్పటి నుంచి రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మందులు వాడుతున్నారు. ప్రసవ సమయం దగ్గర పడడంతో ఈనెల 22న రాత్రి గోకవరం ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. శనివారం ఆమెను ప్రసవం కోసం ఆసుపత్రి వైద్యులు ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు. శస్త్రచికిత్స చేస్తుండగా వెంకటలక్ష్మికి మగబిడ్డకు జన్మనిచ్చి డెలివరీ టేబుల్‌పైనే మృతి చెందింది. అప్పటివరకు ఎంతో ఆరోగ్యంగా ఉన్న గర్భిణి వెంకటలక్ష్మి అకాలంగా మృతి చెందడంతో ఆమె బంధువులు, తోటి ఉద్యోగులు విస్మయానికి గురయ్యారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, సహచర ఉద్యోగులు ఆసుపత్రికి చేరు కొని వెంకటలక్ష్మి మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

● లక్షలో ఒకరికి ఇలా జరుగుతుంది

గర్భిణులు ప్రసవం కోసం శస్త్రచికిత్స పొందుతూ మృతి చెందడం లక్షలో ఒకరికి జరుగుతుందని స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యురాలు



మృతి చెందిన గర్భిణి వెంకటలక్ష్మి



వెంకటలక్ష్మి జన్మనిచ్చిన మగ బిడ్డ

వనజాకుమారి తెలిపారు. వెంకటలక్ష్మి మృతికి కారణా లను ఆమె నుంచి తెలుసుకునే ప్రయత్నం చేయగా ఉమ్మనీరు రక్తనాళాలలోకి ప్రవేశించడంవల్ల గుండెపోటుకు గురై మృతి చెందినట్లు చెప్పారు. నార్మల్ డెలివరీ సమయంలో కూడా ఇటువంటి ఘటనలు జరుగుతాయన్నారు. వెంకటలక్ష్మికి పుట్టిన మగబిడ్డ 3కిలోల బరువుతో ఆరోగ్యంగా ఉన్నాడని ఆమె పేర్కొన్నారు.

విద్యార్థినులపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

● దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు ● పోలీసుల అదుపులో నిందితుడు





నిందితుడిని పోలీస్ వాహనం ఎక్కిస్తున్న పోలీసులు, టీచర్ శ్రీనివాసరావు


వారంతా నిరుపేదల పిల్లలు. కూలీనాలీ చే సుకునే ఆ తల్లిదండ్రులు, తమ పిల్లలు తమలా కష్టపడకూడదనే సంకల్పంతో కార్పొరేట్ స్కూళ్లకు పంపించే స్తోమత లేక ప్రభుత్వం నడుపుతున్న హైస్కూల్‌కి పంపుతున్నారు. అక్కడ తం డ్రి స్థానంలో ఉండి చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినులపై ఎక్కడపడితే అక్కడ చేతులు వేసి నిమురుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతుండడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఆ విద్యార్థినులు అటు ఇంటిలో చెప్పలేక ఇటు హెడ్‌మాస్టర్‌కు చెప్పలేక కుమిలిపోయిన పిల్లలకు శనివారం పాఠశాలలో మహిళా పోలీసులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఈ కీచక ఉపాధ్యాయుడి లీలలు బట్టబయలయ్యాయి. వివరాల్లోకి వెళితే...

కాకినాడ క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):

కాకినాడ జగన్నాధపురం ఘాటీ సెంటర్‌లోని బాలయోగి మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో 6,7, 10వ తరగతి క్లాస్‌లకు గణితశాస్త్రం బోధించే శ్రీనివాసరావు హోంవర్క్ చేయని, అలాగే స్కూల్ కి ఆబ్సెంట్ అయిన విద్యార్థినుల ఒంటిపై చేతులువేసి పిచ్చిపిచ్చి చేష్టలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విధంగా గత రెండు నెలలుగా జరుగుతుంది. ఓపిక, సహనంతో తమ విద్యకు ఆటంకం కలుగుతుందేమోనన్న సందేహంతో విద్యార్థినులు తమలో తాము మద నపడ్డారే తప్ప ఎవరికీ చెప్పుకోలేకపోయారు. టీచర్ శ్రీనివాసరావు వేధింపులు మరింత అధికంకావడంతో శుక్రవారం వారి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో శనివారం గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై విద్యార్థినులకు వన్‌టౌన్ మహిళా పోలీసులు అవగాహనా సదస్సు నిర్వహిస్తున్న తరుణంలో వారిలో కొంత మంది విద్యార్థినులు లేచి మ్యాథ్స్ టీచర్ తమపై రోజు చేస్తున్న లైంగిక వేధింపులను మహిళా పోలీసులకు వివరించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ ఎం.నాగ దుర్గారావు సంఘటనా స్థలికి చేరుకుని శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. బాధిత తల్లిదండ్రులు ఆ కీచక ఉపాధ్యాయుడుని పోలీస్‌స్టేషన్‌కి తీసుకువెళ్లవద్దని తమకు అప్పగించాలని అతడి సంగతి తాము చూసుకుంటామని పోలీసులను ప్రాధేయపడ్డారు. అనంతరం ఆందోళనకారులు పోలీస్ జీపుకు అడ్డుగా బైఠాయించారు. దాంతో సీఐ నాగదుర్గారావు బాధితులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. నిందితుడు శ్రీనివాసరావును పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కీచక ఉపాధ్యాయుడు 2016 నుంచి ఆ పాఠశాలలో పనిచేస్తున్నాడు. అప్పటి నుంచి అతడు ఎన్ని అఘాయిత్యాలకు పాల్పడ్డాడో అనే దానిపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విచారణ నిర్వహిస్తాం: డీఈవో

కాకినాడ రూరల్: కాకినాడ జగన్నాధపురంలోని జీఎంసీ బాలయోగి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థినులపై గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినుల తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాలవద్ద శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, డీఈవో పి.రమేష్, డీవైఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవో రవి హుటాహుటిన ఆ పాఠశాలకు వెళ్లారు. అప్పటికే పోలీసులు సంబంధిత ఉపాధ్యాయుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యార్థులందరినీ పాఠశాల నుంచి పంపించేశారు. అధికారులు ఆ పాఠశాలలోని మిగతా ఉపాధ్యాయులను విచారించి సమాచారం తెలుసుకున్నారు. పోలీసుల విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని డీఈవో రమేష్ తెలిపారు.



చింతపల్లి లోవరాజు

రోడ్డు ప్రమాదంలో ఐటీబీపీఎఫ్ కానిస్టేబుల్ లోవరాజు మృతి

నేడు పేరూరులో అంత్యక్రియలు

అమలాపురంరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ మండలం పేరూరు చింతపల్లివారిపాలేనికి చెందిన చింతపల్లి లోవరాజు (32) ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్‌ఫోర్స్ (ఐటీబీపీఎఫ్)లో పనిచేస్తున్నారు. విశాఖపట్నం కేంద్రంగా పనిచేసే ఈయన ఇటీవల అసోం బదిలీ కావడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 22న అసోం నుంచి కుటుంబాన్ని చూసేందుకు విశాఖపట్నం వచ్చారు. ఆనందపురం-పెందుర్తి సర్వీసు రోడ్డులో బైక్‌పై లోవరాజు ప్రయాణిస్తుండగా వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోవరాజు చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతదేహాన్ని పేరూరు తరలించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. లోవరాజుకు భార్య, ముగ్గురు పిల్లలతో పాటు తల్లి, సోదరుడు ఉన్నారు.



దేవరపల్లిలో నిందితులతో వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాయక్

40.550కిలోల గంజాయి స్వాధీనం

● నలుగురు వ్యక్తుల అరెస్టు



పట్టుబడ్డ గంజాయి మూటలు

దేవరపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్లపై వెళుతు న్న నలుగురు వ్యక్తులను అరెస్టుచేసి వారి నుంచి 40.550 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బీఎన్ నాయక్ తెలిపారు. దేవరపల్లిలోని సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన వివరాలను వెల్లడించారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యంకు అందిన సమాచారం మేరకు శనివారం దేవరపల్లి డైమండ్ జంక్షన్‌వద్ద వాహనాలను తనిఖీ నిర్వహిస్తుండగా ఈ గంజాయి నిందితులు పట్టుబ డ్డారని తెలిపారు. విశాఖజిల్లా పాడేరు, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా, తదితర ప్రాంతాల నుంచి కేరళ రాష్ట్రానికి చెందిన నలుగురు యువకులు అమల్‌కృష్ణ, మహమ్మద్ సాహల్, సాహల్ మొన్, అభినవ్ పునతిల్ ముత్తల్‌లు నాలుగు గంజాయి మూటలతో రెండు మోటార్ సైకిళ్లపై తమిళనాడు రాష్ట్రం, కోయంబత్తూర్‌కు తరలిస్తుండగా వారివద్ద నుంచి మోటార్‌సైకిళ్లు, 40.550 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఓఎన్జీసీ వెల్‌సైట్‌లో వైట్ ఆయిల్ చోరీ

● ముగ్గురు నిందితులు అరెస్టు



అమలాపురం తాలూకా సీఐ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏ మాత్రం అదుపు తప్పినా ప్రమాదకరమని తెలిసినప్పటికీ పాత నేరస్తుడు అదే పంథాను కొనసాగిస్తూ ఓఎన్జీసీ బావి వద్ద మరోసారి వైటాయిల్ దొంగిలిస్తూ ఉప్పలగుప్తం పోలీసులకు ముఠాతో సహా పట్టుబడ్డాడు. ఈ కేసుకు సంబంధించి అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ శనివారం స్థానిక తాలూకా సీఐ కార్యాలయంవద్ద వివరాలను వెల్లడించారు. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామంలోని రావూరి కాల్వగట్టు సమీపంలో ఉన్న ఓఎన్జీసీ జీఎం-14 వెల్‌సైట్‌లో గత ఐదు నెలలుగా వైటాయిల్‌ను చోరీ చేస్తున్న ముఠాను రూరల్ సీఐ పి.వీరబాబు, ఉప్పలగుప్తం సీహెచ్ రాజేష్‌ల బృందం చాకచక్యంగా పట్టుకున్నారని తెలిపారు. పశ్చిమగోదావరిజిల్లా యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గుడాల రమేష్ (37) ఇదే తరహాలో నేరాలుచేస్తూ పలు పర్యాయాలు పోలీసులకు చిక్కాడు. అతనికి తోడుగా పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామానికి చెందిన జోగి ధనరాజు (44)తో కలిసి చల్లపల్లి ఓఎన్జీసీ సైట్‌లో వైటాయిల్ వచ్చే గ్యాస్ ప్రెజర్‌కు వెల్‌నాబ్‌ను అమర్చి మరో పైపులైను బిగించి వైటాయిల్‌ను చోరీ చేస్తున్నారు. గత ఐదు నెలలుగా ఇదే తరహాలో వైటాయిల్‌ను చోరీ చేస్తున్నారు. గత నెల 24న ఈ తరహాలో వైటాయిల్ దొంగిలిస్తుండగా ఓఎన్జీసీ వెల్ లీకై పెద్దగా శబ్దం రావడంతో గమనించి అక్కడి నుంచి రమేష్, ధనరాజులు పరారయ్యారు. దీనిపై ఓఎన్జీసీ రెసిడెంట్ ఇంజనీర్ చొప్పర రామకృష్ణారావు ఉప్పలగుప్తం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ రాజేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ దశలో ఉండగానే మళ్లీ వీరు వైటాయిల్ చోరీకి ప్రయత్నించారు. చోరీచేసిన వైటాయిల్‌ను ప్లాస్టిక్ టిన్నుల్లో నింపి రహస్యంగా అంబాజీపేట మండలం కె.పెదపూడిలో ఉన్న పంజా నూకరాజుకు లీటరు రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. నూకరాజు ఆ వైటాయిల్‌ను సమీపంలోని చేపల చెరువులకు వాడే ఇంజన్లకు లీటరు రూ.80 చొప్పున విక్రయిస్తున్నాడు. ఈ నెల 22న మండల పరిధిలోని గోపవరంలో వాహనాలు చెక్‌చేసే సమయంలో రమేష్, ధనరాజు, నూకరాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో వారిని విచారించి అరెస్టుచేసి వారి వద్ద నుంచి మోటారుసైకిల్‌తోపాటు చోరీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టుచేసిన సీఐ వీరబాబు, ఎస్ఐ రాజేష్‌లను ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. ప్రమాద భరితమైన ఇటువంటి పనులు ఎవరూ చేయరాదని, వీటికి అడ్డుకట్ట వేసేందుకు ఓఎన్జీసీ బావుల వద్ద పోలీసుల నైట్‌బీట్‌లు పెంచుతామన్నారు. అదేవిధంగా ఓఎన్జీసీ సిబ్బంది కూడా ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.

పిఠాపురంలో బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం



బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభిస్తున్న వైద్యుడు, క్రీడాకారులు

పిఠాపురం, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్ బాల్ స్త్రీ, పురుషుల ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడ జిల్లా పిఠాపురంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి ఈపోటీలను వైద్యుడు కాశీ విశ్వనాథం, సీనియర్ క్రీడాకారులు ప్రారంభించారు. రెండ్రోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయి. పట్నాల అన్నేశ్వరరావు, రావుల వరహాలు మెమోరియల్ పేరుతో జరుగుతున్న ఈ పోటీల్లో జిల్లా నలమూలల నుంచి 12 పురుషులు, 8మంది స్త్రీ జట్లు తలపడనున్నాయి. విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. కార్యక్రమంలో కొత్తెం సుందర్ కుమార్, గండి కొండలరావు, వీఎస్ రెడ్డి, రామయ్య, అనుబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ బస్సుల ఢీ: తృటిలో తప్పిన ప్రమాదం



కాకినాడ జీజీహెచ్ కూడలిలో రెండు బస్సులు ఢీ కొన్న దృశ్యం

కాకినాడ క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండు ఆర్‌టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటన శనివారం కాకినాడలో జరిగింది. అయితే జనసాంద్రత తక్కువగా ఉన్న నేపథ్యంలో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. కాకినాడ జీజీహెచ్ ఎదురుగా ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహ కూడలిలో శనివారం ఉదయం రాజమహేంద్రవరం నుంచి కాకినాడకు ఆర్‌టీసీ హయ్యర్ బస్సు వస్తుంది. అదే సమయంలో కాకినాడ నుంచి అమలాపురంనకు ఆర్‌టీసీ బస్సు వెళుతోంది. ఆ సమయంలో హయ్యర్ బస్సు నడుపుతున్న చిన్ని వేగంగా నడుపుతూ ఆసుపత్రి వైపు టర్నింగ్ తీసుకుంటున్న అమలాపురం బస్సును ఢీ కొన్నాడు. దాంతో బస్సు ముందు భాగం దెబ్బతింది. అయితే రద్దీ ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు డ్రైవర్ చిన్ని పై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ

కొత్తపేట, నవంబరు23(ఆంధ్రజ్యోతి):కొత్తపేట సబ్‌జైలును శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి అనంతరం అక్కడ వసతులను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు అందుతున్న సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు.

నేడు శెట్టిబలిజ వనసమారాధన

యానాం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): యానాం శెట్టిబలిజ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం పెర్రీరోడ్డులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శెట్టిబలిజ వనసమారాధన నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పాల్గొంటారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి



అమలాపురం: సత్యసాయిబాబా చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ కేఎస్ఎన్ రావు కుటుంబ సభ్యులు

అమలాపురం టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను అమలాపురం మోబర్లీపేటలో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ కేఎస్ఎన్ రావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటలు సుప్రభాతం, సత్యసాయి సనాతన ధర్మాలు, ప్రేమతత్వం, ఆధ్యాత్మికత, మానవతా విలువలను తెలియచేస్తూ పలువురు వక్తలు మాట్లాడారు. సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులకు మిఠాయిలు పంచారు. జయంతి పూజా కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులుపాల్గొన్నారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్య సాయిబాబా 99 జయంతి వేడుకలను అంబాజీపేట సత్యసాయి మందిరంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు స్వీట్లు అందించారు. తొలుత బాబా మందిరంలో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయి సదనంలో శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సామూహిక సత్యవ్రతాలు, పాలాభిషేకాలు, పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నగర సంకీర్తన, సాయిభజనలు, అఖండసాయి నామసంకీర్తనలు జరిగాయి. గోడి, గోడిలంక గ్రామా ల్లో సాయి భక్తులు సత్యసాయి పూజలు జరుపుకున్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): మావుళ్ళమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం పుట్టపర్తి సత్య సాయిబాబా జయంతిని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆణివిళ్ళ సాయిబాబా ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆణివిళ్ళ ఫణికాంత్ 99ప్రమిదలతో సాయిదీపోత్సవం నిర్వహించారు. సాయిబాబా చిత్రపటానికి పూలమాలలువేసి పూజలుచేశారు. అధికసంఖ్యలో భక్తులు సాయిభజనల్లో పాల్గొన్నారు. గ్రంధి రాంప్రసాద్, ఆణివిళ్ళ రామకృష్ణపరమహంస,మంత్రిప్రగడ శ్రీనివాస్, శాంతాసుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం షిర్డిసాయి, సత్యసాయి ఆలయంలో భగవాన్ శ్రీసత్య సాయిబాబా 99వ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మంగళవాయిద్యాలతో మేలుకొలుపుసేవ, ఓంకారం, సుప్రభాతసేవ, నగర సంకీర్తన నిర్వహించారు. ప్రభలదిబ్బ శ్రీసత్యసాయి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం, పెన్నులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాయంత్రం పల్లకీలో సాయిబాబాను ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీభగవాన్ శ్రీసత్య సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మారుతున్న వాతావరణం.. రైతుల ఆందోళన



మామిడికుదురులో వరిని ట్రాక్టరుతో నూర్చుకుంటున్న రైతులు

మామిడికుదురు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వాతావరణం క్రమేణా మారుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సార్వా పంట చేతికి వచ్చే సమయంలో శనివారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు సంభవించడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. కోసిన పంటను రక్షించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న వరి పనలను మెరక ప్రాంతాలకు తరలించుకుని నూర్పిడి చేసుకుంటున్నారు. మండలంలో 2420 ఎకరాల విస్తీర్ణంలో సార్వా పంట సాగు చేశారని, 150ఎకరాల విస్తీర్ణంలో పంట మాసూళ్లు పూర్తయ్యాయని, ఇప్పటివరకు 600క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని ఏవో బి.మృదుల తెలిపారు. సార్వా పంట ఆశాజనకంగా ఉందని ఎకరాకు 25నుంచి 28బస్తాల దిగుబడి రావచ్చని వ్యవసాయాధికారి తెలిపారు.

ఇకపై మల్లాడితో వేదిక పంచుకోను: ఎమ్మెల్యే

యానాం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యానాంలో పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుతో పాటు తాను ఒకే వేదికపై ఉండేది లేదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ప్రొటోకాల్ పాటించడం లేదని ఇప్పటికే అధికారులపై ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేశానన్నారు. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా ఒకే వేదికపైకి ఇద్దర్ని ఆహ్వానిస్తే ఆ ప్రభుత్వ కార్యక్రమాన్ని బహిష్కరిస్తానని అన్నారు. ఆహ్వానపత్రికల్లో మల్లాడి పేరు ప్రచురించడం, ఒకే వేదికపైకి ఇద్దర్ని ఆహ్వానించడం ప్రొటోకాల్‌కు విరుద్ధమని, అలాచేస్తే ప్రజలతో ఎన్నికైన వ్యక్తిని అగౌరవపరచడే అవుతుందన్నారు. ఢిల్లీ ప్రతినిధి నామినేటెడ్ పదవి ఉన్న వ్యక్తి మల్లాడి పేరును యానాంలో జరిగే కార్యక్రమాల్లో తప్ప పుదుచ్చేరిలో జరిగే కార్యాక్రమాల్లో ఎందుకు వేయడం లేదని అన్నారు. ప్రొటోకాల్ విషయంపైఫిర్యాదుచేశానని, దీనిపై నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నానని అన్నారు.

అవగాహనలేని మాటలు మానుకోవాలి

ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

యానాం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అవగాహన లేని మాటలు మానుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మల్లాడి ఎమ్మెల్యే గొల్లపల్లి చేసిన ఆరోపణలపై మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యేగా, మాజీ మంత్రిగా తాను కార్యక్రమానికి వస్తే ప్రొటోకాల్ ప్రకారం స్టేజ్‌పైకి వచ్చే అర్హత తనకు లేదని మల్లాడి అన్నారు. అయితే నేను కేబినెట్ ర్యాంకులో 6వ మంత్రిగా ఉన్నాను కాబట్టి ప్రొటోకాల్ ప్రకారం స్టేజ్‌పైకి వచ్చే అర్హత తనకు ఉందని మల్లాడి చెప్పారు. గవర్నర్‌ను కూడా రాష్ట్రపతి నామినేట్ చేసి నియమిస్తారని, అయితే పుదుచ్చేరి జరిగే కార్యక్రమాలకు గవర్నర్‌తో పాటు ప్రజలతో ఎన్నికైన ముఖ్యమంత్రి కూడా ఒకే స్టేజ్‌పై ఆశీనులవుతారని మల్లాడి గుర్తుచేశారు. పుదుచ్చేరి ప్రత్యేక ప్రతినిధిగా తనను గవర్నర్ నియమించారని మల్లాడి చెప్పారు. తాను హాజరే కార్యక్రమాలకు ఎమ్మెల్యే పాల్గొనని చెప్పడమంటే గవర్నర్ జారీచేసిన ఉత్తర్వులను అవమానించడమే అవుతుందన్నారు. ఇకనైనా అవగాహన లేని వ్యాఖ్యలు మానుకోవాలని ఎమ్మెల్యేకు మల్లాడి హితవు పలికారు.

కుండలేశ్వరంలో భక్తజనం పూజలు







కాట్రేనికోన: కుండలేశ్వరస్వామి, అమలాపురం: బండారులంక తిరుచ్చి సేవలో బతుకమ్మలతో యువతులు, బాలికలు, ముమ్మిడివరం: ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకుంటున్న భక్తులు

కాట్రేనికోన, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):శనివారం అధిక సంఖ్యలో భక్తులు కుండలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో చెయ్యేరుఅగ్రహారానికి చెందిన అప్పన సూరేశ్వరరావు, భాగ్యలక్ష్మి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నసమారాధనలో 3000మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎస్‌ఐ అవినాష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. త్సవటపల్లి నాగు, గోకరకొండ సత్తిబాబు, గంగుమళ్ళ భాను, పీఎస్ఎన్ రాజు, మీసాల నాగబాబు, మోటిపల్లి చిన్న, అక్కల నాగమందేశ్వరరావు, గంగుమళ్ళ కిరణ్, మోటిపల్లి శ్రీను, సలాది సతీష్, చిక్కం ఆనందకుమార్, అడపా శివ, అడపా వెంకటేశ్వరరావు, జి.శంకర్ పాల్గొన్నారు.

వైకుంఠనాథునికి తిరుచ్చి సేవ

అమలాపురం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి మందిరం వద్ద పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శనివారం వైభవంగా తిరుచ్చి సేవ నిర్వహించారు. పల్లకీపై స్వామి-అమ్మవార్లను ఉంచి విశేష అలంకరణ చేశారు. పురవీధుల్లో మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలతో తిరుచ్చి సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. బిళ్లవారి వీధి నుంచి ఎగ్జిబిషన్ వీధి, వీరభద్రస్వామి గుడిసెంటర్, వీరభద్రపురం మీదుగా శివాలయం వరకు తిరుచ్చి సేవ నిర్వహించారు. శ్రీనివాసా అన్నదాన మహిళా సేవాసంఘం ప్రతినిధులు ఏకరూపు చీరలు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. కేరళ వాయిద్యాలు, ఆర్ట్ ఫ్యామిలీ ఉషారాణి బృందం కోలాటాలు, శ్రీరామభజన మండలి కోలాటం అందరినీ ఆకట్టుకున్నాయి. యువతులు, బాలికలు బతుకమ్మలను ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. తొలుత ఆలయంలో స్వామి-అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం 2వేల మందికి అన్నసమారాధనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అంకం హిమభారతి, దైవపు కోటేశ్వరరావు, శ్రీనివాసా బాలమిత్ర సంఘం ప్రతినిధులు చింతపట్ల బాబు, బిళ్ల విశ్వేశ్వరరావు, అంకం పెదరాజు, లక్కింశెట్టి ఫణిరాజు, పిల్లి పల్లపురాజు, కడి సుబ్రహ్మణ్యం, బళ్ల సాయి, రేపాక గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

ముమ్మిడివరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలోని శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం నాల్గో శనివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భారీ ఎత్తున భక్తులు క్యూలైన్‌లో ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు కొండవీటి రాంబాబు, ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో జ్యోతిర్లింగాలను ఏర్పాటుచేశారు. అత్యంత ప్రాముఖ్యత కలిగిన శివాలింగాలను ఒకేచోట ఏర్పాటుచేయడంతో భక్తులు వాటిని తిలకించారు. ఈసందర్భంగా ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పెన్మెత్స చిట్టిరాజు ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. భారీ అన్నసమారాధన జరిగింది.

లక్షపత్రి పూజ

అమలాపురం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నల్లమిల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత మల్లేశ్వరస్వామికి పవిత్ర కార్తీకమాసం సందర్భంగా లోక కల్యాణార్థం లక్ష పత్రి పూజ నిర్వహించారు. శైవాగమ విధానంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, మండపారాధన, స్వామివారికి శ్రీరుద్రాభిషేకం జరిపించారు. మల్లేశ్వరస్వామికి విశేష అలంకరణ జరిపారు. లక్షపత్రి పూజతో పాటు రుద్రహోమం జరిపించారు. ఆలయ అర్చకులు కొత్తలంక శేఖర్ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన, శాంతి కల్యాణం జరిపించారు. ఆలయ ఛైర్మన్ నల్లా సత్యనారాయణతో పాటు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

రామేశ్వరునికి లక్షబిల్వార్చన

అల్లవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీరామలక్ష్మణులతో శివలింగ ప్రతిష్ఠతో పురాన ప్రసిద్ధిపొందిన ఎస్.రామేశ్వరంలో పార్వతీ సమేత రామేశ్వరునికి కార్తీకమాసం సందర్భంగా శనివారం లక్ష బిల్వార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఛైర్మన్ అంగాని రామారావు పర్యవేక్షణలో పుల్లేటికుర్తి శంకరం బ్రహ్మత్వాన లక్ష బిల్వార్చన పూజలు జరిగాయి. వివిధ గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి రామేశ్వరున్ని దర్శించుకున్నారు.

365 స్పటికి లింగాలతో మహాలింగార్చన

ఉప్పలగుప్తం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి బసవయ్య అగ్రహారంలో 22రోజులుగా కార్తీక మాస దీక్ష జరుగుతోంది. 22వ రోజు శనివారం 365 స్పటిక లింగాలు, 365 మృత్తికాశోదిత లింగాలతో మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు. కాలభైరవాష్టమిని పురస్కరించుకుని జరిగిన మహాలింగార్చనలో అధికసంఖ్యలో భక్తులు గోత్రనామాలతో అభిషేకపూజలు చేయించుకున్నారు. మున్నంగి రామకృష్ణశర్మ సారథ్యంలో కేశాప్రగడ కిశోర్‌శర్మ బ్రహ్మత్వంలో పూజలు జరిగాయి.

జార్ఖండ్‌లో విజయం పట్ల కాంగ్రెస్ శ్రేణుల హర్షం

అమలాపురం టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రంలో కాంగ్రెస్ కూటమి విజయం సాధించడం శుభపరిణామమని ఆ పార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు హర్షం వ్యక్తం చేశారు. వయనాడ్ నుంచి తొలిసారి పోటీచేసిన ప్రియాంకగాంధీ 4.39లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం పట్ల హర్షం ప్రకటించారు. రానున్నకాలంలో రాహుల్ ప్రధాని కావడం ఖాయమన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పట్టణశాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, గెడ్డం సురేష్‌బాబు, కుడుపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన

యానాం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యానాం విద్యా శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులుగా స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరుగుతున్న ప్రాంతీయ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శనివారంతో ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో వివిధ విభాగాల్లో 109 ప్రదర్శనలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ అధ్యక్షతన స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి మునిస్వామి హాజరయ్యారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని దివ్యాంగుడి మృతి

న్యాయం చేయాలని దివ్యాంగుల ఆందోళన



అమలాపురం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

అమలాపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన దివ్యాంగుడు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శనివారం దివ్యాంగులు నిరసన తెలిపారు. అమలాపురం తాలుకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పి.గన్నవరం మండలం నరేంద్రపురానికి చెందిన జుత్తుక శ్రీనివాసరావు(40) అమలాపురంలో ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి మోటారుసైకిల్‌పై అమలాపురం వస్తుండగా బండారులంక దంగేటివారిపాలెం సెంటర్లో రాజమహేంద్రవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తలకి బలమైన గాయమైంది. అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం శ్రీనివాసరావు మృతి చెందాడు. అతడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీనివాసరావు కుటుంబానికి న్యాయం చేయాలని ఒంటెద్దు వెకన్ననాయుడు ఆధ్వర్యంలో దివ్యాంగులు తాలుకా పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌బాబు తెలిపారు.

ఇసుక తవ్వకాలపై స్థానికుల అభ్యంతరం

పి.గన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెం ఏటిగట్టు దిగువున ఉన్న లంకల్లో ఇసుక తవ్వకాలను స్థానికులు అడ్డుకున్నారు. ఇక్కడ ఏవిధమైన ర్యాంపులు లేవని, శ్మశానవాటిక పరిసరాల్లో ఇసుక తవ్వకాలు నిలిపి వేయాలని మండలస్థాయి అధికారులను కోరారు. దీంతో తహశీల్దార్ పి.శ్రీపల్లవి ఎంపీడీవో కేవీ ప్రసాద్‌తో కలిసి ఇసుక తవ్వకాలు చేపట్టిన ప్రదేశాన్ని పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. ఈప్రాంతంలో శ్మశానవాటికతో పాటు పచ్చని పంట పొలాలు ఉన్నాయని, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇసుక ర్యాంపును ఏర్పాటుచేసి తవ్వకాలు చేపట్టడం సబబుకాదని రైతులు వివరించారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ త్రీమెన్ కమిటీతో చర్చించి రైతులు, సమీప గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్ణయం తీసుకుంటామన్నారు.

రాజ్యాంగ చట్టాలే మహిళలకు ఆయుధాలు

ఉప్పలగుప్తం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంలో తమకున్న చట్టాలనే ఆయుధాలుగా మలుచుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి వి.నరేష్ మహిళలకు సూచించారు. ఉప్పలగుప్తం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్ విధాన్ సే సమాధాన్ పేరిట శనివారం మహిళలకు న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గృహిణులైనా, ఉద్యోగులైనా తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చట్టాలను వినియోగించుకోవాలన్నారు. ఇది జరగాలంటే ప్రతి మహిళ తమకు నిర్దేశించిన ప్రత్యేక చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళా చట్టాలు, మహిళల హక్కులు, మహిళల రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈసదస్సులో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు, తహశీల్దార్ వాసా దివాకర్, ఎంపీడీవో పీఆర్పీ రాజ్‌కుమార్, ఎస్‌ఐ చలమల రాజేష్, వెలుగు ఏపీవో అయితాబత్తుల సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.25వేలు విరాళం

అయినవిల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణానికి చెందిన మంథా సాంబశివశాస్త్రి, కుటుంబ సభ్యులు శనివారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని అన్నప్రసాద ట్రస్టుకు రూ.25వేలు విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.

మత్స్యకారులకు రూ.20వేలు భృతి చెల్లించాలి



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన మత్స్యకార సంఘ నాయకులు

అమలాపురంటౌన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భృతిని రూ.20వేలకు పెంచాలని కోరుతూ మత్స్యకార సంఘ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఓఎన్జీసీ, గెయిల్ తదితర చమురు సంస్థలు చేపడుతున్న కార్యకలాపాల వల్ల మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఆయిల్ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకునే సమయంలో ఒక శాతం లాభాన్ని మత్స్యకార సంక్షేమానికి కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో ఉభయ గోదావరి జిల్లాల మత్స్యకారుల సంక్షేమ సంఘ నాయకులు కర్రి చిట్టిబాబు, నాగిడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో డీవైఈవో ముఖాముఖి

అంతర్వేది, నవంబరు23(ఆంధ్రజ్యోతి): అంతర్వేది, అంతర్వేదిపల్లిపాలెం, దేవస్థానం, ఆశ్రమ పాఠశాల, హైస్కూలు విద్యార్థులతో జిల్లా ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాష్ ముఖాముఖి నిర్వహించారు. తొలుత మండలంలో ఎంఈవో కార్యాలయంలో ఎంఈవోలతో మాట్లాడి పాఠశాలల పనితీరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం పది పరీక్షల్లో ఉపాధ్యాయుల సూచనలు అనుసరించి ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం ఎం.రత్నరాజు, ఉపాధ్యాయులు ప్రేమ్‌చంద్, సుబ్బలక్ష్మిపాల్గొన్నారు.

మైనర్లు బైకులు నడిపితే కఠిన చర్యలు

మలికిపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మైనర్లు బైకులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటానని మలికిపురం ఎస్‌ఐ పి.సురేష్ అన్నారు. శనివారం డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లను అదుపులోకి తీసుకుని వారికి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా మైనర్లు మోటారు సైకిళ్లు నడిపినా, వారికి వాహనాలు ఇచ్చినా, మైనర్లతోపాటు వారి తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు.

నేడు గుడిమెళ్లంకకు శృంగేరి పీఠాధిపతి రాక

మలికిపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం గుడిమెళ్లంక గ్రామానికి ఆదివారం శృంగేరీ శారదా పీఠం పీఠాధిపతి విధుశేఖర భారతీమహాస్వామి విచ్చేస్తారని గుడిమెళ్లంక శివాలయం కమిటీ సభ్యులు తెలిపారు. స్వామిజీ రాక కోసం భారీ ఏర్పాట్లు చేశామన్నారు. 25న శ్రీఉమాలక్ష్మణేశ్వరస్వామి ఆలయ ప్రవేశం, అనంతరం భూమిపూజ, అభిషేకం, పండిత సత్కారం, భక్తుల దర్శనం, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 26న అంతర్వేది సముద్రస్నానం, లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనం, అనంతరం గుడిమెళ్లంకలో అల్లూరి విశ్వనాథరాజు సందర్శన జరుగుతాయని తెలిపారు.

ఎన్డీఏ కూటమి నేతల అభినందనలు

ముమ్మిడివరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లి అశోక్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమించడంపై ఆయన్ను పలువురు అభినందించి సత్కరించారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల ఎన్డీఏ కూటమి నేతలు శనివారం అశోక్‌ను స్వగృహంలో కలిసి దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. టీడీపీ హెచ్‌ఆర్డీ రాష్ట్ర సభ్యులు నేదునూరి వీర్రాజు, పోతుకుర్రు మాజీ సర్పంచ్ గుమ్మళ్ల శ్రీనివాససాగర్, అయినవిల్లి మండల టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు మోర్త వీరవెంకటసత్యనారాయణ, బడుగు సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి

ముమ్మిడివరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి చిన్నతనం నుంచి సత్ప్రవర్తన కలిగి ఉన్నత చదువులు చదివి అభివృద్ధి సాధించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. కొత్తలంకలోని సిద్ధార్థనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బార్ సభ్యులు కాశి సిద్ధార్థకుమార్, వడ్డి త్రిమూర్తులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పోలీసులు, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి

మామిడికుదురు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి శనివారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్ను వసూలు తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఘన వ్యర్థాల కేంద్రాలను సక్రమంగా నిర్వహించేలా చూడాలని సూచించారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణరాజు, పీవీఎస్వీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ

మామిడికుదురు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశంలో కాంగ్రెస్ పార్టీకి క్రమేణా ఆదరణ పెరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. శనివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో జార్ఖండ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని కైవసం చేసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రియాంకగాంధీ అత్యధిక మెజార్టీతో వయనాడ్‌లో గెలుపొందడం ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారనడానికి నిదర్శనమన్నారు. భవిష్యత్‌లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన జోష్యం చెప్పారు.

డిమాండు ఉన్న వస్తువులను ఉత్పత్తి చేయాలి

ముమ్మిడివరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో డిమాండు ఉన్న వస్తువులను ఉత్పత్తి చేయడం ద్వారా వాటిని మార్కెటింగ్ చేసుకోవడం సులభతరమవుతుందని, తద్వారా వ్యాపార అభివృద్ధిని సాధించవచ్చునని నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ పి.రవివర్మ సూచించారు. నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన అర్బన్ మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. స్వయం సహాయకసంఘాల సభ్యులు ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో చీరలు, పంజాబీడ్రెస్సులు, పచ్చళ్లు, తినుబండారాలు, జ్యూట్ బ్యాగులు, ఫ్లవర్‌వాజ్‌లు, కొవ్వొత్తులు, పేపర్‌ప్లేట్లు, ఆర్గానిక్ వస్తువులు తదితర వాటిని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాడి నరసింహారావు, పిల్లి నాగరాజు, మెండి కమల, కాశి లాజర్, మేనేజర్ పీవీ నూకరాజు, ఆర్‌ఐ భాస్కరరావు, హెల్త్ అసిస్టెంట్ జె.సత్యనారాయణరాజు, సీఎంఎం భాస్కర్, కోఆర్డినేటర్ రాజేశ్వరి, ఆర్పీలు, నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన నరసింహారావు



ముమ్మిడివరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాడి నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని అసెంబ్లీలో గల మంత్రి చాంబర్‌లో లోకేశ్‌ను నరసింహారావు కలిసి పార్టీకి అందిస్తున్న సేవలను వివరించారు. పార్టీ నామినేటెడ్ పదవిలో తనకు అవకాశం కల్పించాలని లోకేశ్‌ను కోరారు. అందుకు లోకేశ్ సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. నరసింహారావు వెంట దాట్ల బాబు, పాయసం చిన్నీ, పంతగడ చిరంజీవి తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు జె.వెంకటేశ్వరి సూచించారు. చిరతపూడి సొసైటీలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె శనివారం పరిశీలించారు. మండలంలో 7,411మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ఇప్పటి వరకూ 48మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. చిరతపూడి, గంగలకుర్రు, పుల్లేటికుర్రు, ముక్కామల, ఇరుసుమండ, అంబాజీపేటలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. ధాన్యం విక్రయించిన 48గంటల్లో రైతు ఖాతాకు సొమ్మును జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌ఐ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి

అంతర్వేది, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో కూటమి ప్రభుత్వం రాకతో అభివృద్ధి మెరుగు పడుతుందనడంలో సందేహం లేదని టీడీపీ మండలఅధ్యక్షుడు ముప్పర్తి నాని అన్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గ టీడీపీ నాయకులతో కలిసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిటికెల రామ్మోహనరావు, చాగంటి స్వామి, తాడి సత్యనారాయణ, పిండి సత్యనారాయణ, కౌరు శ్రీను, కడలి వెంకటరత్నం, మందపాటి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు, పదహారు గ్రామ శాఖల అధ్యక్షులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాలు నమోదు చేయించండి

రాజోలు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా సభ్యత్వ నమోదు చేయించుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, రాజోలు నియోజకవర్గం సభ్యత్వ నమోదు పాయింట్ ఆఫ్ కాంట్రాక్ట్ చాగంటి స్వామి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ములికిపల్లి, కడలి గ్రామాల్లో శనివారం జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో ములికిపల్లి టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు సోమిశెట్టి ప్రకాష్, రాజోలు నియోజకవర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, యల్లమిల్లి లక్ష్మణరావు, కడలి శ్రీనివాస్, పాటి నాగరాజు, కడలి రమేష్, గాలిదేవర ఉదయ్, కుడుపూడి మణిబాబు పాల్గొన్నారు.

ఆయిల్ మిల్లుల వ్యాపారుల కార్తీక వనసమారాధన

అంబాజీపేట, నవంబరు23(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట కొబ్బరి నూనె మిల్లులు, వ్యాపారుల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. వెంకట్రాజు ఆయిల్‌మిల్లు ఉసిరి చెట్టు వద్ద పండితులు మర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి వీరరాఘవులు, వర్రే చింతన్న, బిక్కిన వీరన్న, గణపతి బాబి, అధికారపు బాబ్జి పాల్గొన్నారు.

అల్లవరంలో రెండు షాపుల్లో చోరీలు

వరుస దొంగతనాలతో బెంబేలు: కొరవడ్డ పోలీస్ నిఘా

అల్లవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అల్లవరం పోలీస్‌స్టేషన్ సమీపంలో వంతెన దిగువ గురువారం అర్ధరాత్రి సత్యస్టూడియో, టైలరింగ్ షాపుల వెనుక తలుపులు గునపంతో పగలుకొట్టి దొంగలు విలువైన సొత్తు దోచుకున్నారు. అల్లవరంతో సహా మండలంలో వరుస దొంగతనాలు జరిగిన పోలీస్ దర్యాప్తు, నిఘాలేదని ఆరోపిస్తున్నారు. దొంగలు రెచ్చిపోయి వరుస దొంగతనాలకు పాల్పడటంతో వ్యాపారులు భయాందోళన చెందుతున్నారు. అల్లవరం సత్యస్టూడియో వెనుక తలుపులు పగలుకొట్టి కెనాన్ కెమేరా, మూడు ఫ్లాష్‌లు, రెండులెన్సులు, 2టీబీ హార్డ్‌డిస్కులు, నగదు దొంగలుదోచుకుపోయారని, వీటి విలువ రూ.2.20లక్షలు ఉంటుందని యజమాని ఈటి వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెనుక తలుపు పగలుకొట్టి టైలరింగ్ షాపులోకి దొంగలు ప్రవేశించారని, అయితే ఏ వస్తువులు అపహరించలేదని మేడిద సుబ్బరావు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దొంగలువాడిన గునపం అక్కడే వదలివెళ్లారన్నారు.

గోడిలంక ఆక్వా చెరువుల వద్ద 21 మోటార్లు చోరీ

గోడిలంక ఆక్వా చెరువుల వద్ద శుక్రవారం రాత్రి 21ఏరియేటర్ల మోటార్లను దొంగలు అపహరించారని రైతు నడింపల్లి రమేష్‌రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందన్నారు. మండలంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో వ్యాపారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముమ్మిడివరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిలిస్టు ఢీకొనడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చినకొత్తలంక పంచాయతీ పరిధిలోని కొత్తకాల్వకు చెందిన పొత్తూరి రాజగోపాలవర్మ ఉద్యోగ రీత్యా కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని జీడిమెట్లలోని షాపూర్‌నగర్‌లో ఉంటున్నాడు. తల్లిదండ్రులు కొత్తలంకలో ఉంటున్నారు. తండ్రి అనారోగ్యానికి గురవ్వడంతో పది రోజుల క్రితం రాజగోపాల్‌వర్మ కొత్తలంక వచ్చాడు. శుక్రవారం బ్యాంకులో సొమ్ములు తీసుకునేందుకు ఆటోలో ముమ్మిడివరం వచ్చి బ్యాంకులోకి నడిచి వెళుతుండగా అమలాపురంవైపు నుంచి వస్తున్న మోటారు సైకిలిస్టు ఢీకొనడంతో రాజగోపాలవర్మ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ముమ్మిడివరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. స్టేషన్‌హౌస్ ఆఫీసర్ జీబీ స్వామి కేసు దర్యాప్తు చేపట్టారు.

14 మంది బెల్టుషాపు నిర్వాహకుల బైండోవర్

అమలాపురం టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తున్న 14మందిని అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకుని తహశీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి 136 డ్యూటీఫైడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గతంలో కేసులున్న ఇదర్ని రిమాండుకు పంపించామని తెలిపారు. శనివారం కామనగరువు, గంగలకుర్రు అగ్రహారం, ఎ.వేమవరం గ్రామాల్లో నాటుసారా వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు వినియోగించవద్దని ప్రచారం సాగించారు. ఆయా కార్యక్రమాల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ బాలాజీ, హెచ్‌సీలు చాయాకుమారి, నాగేంద్ర, నాగేశ్వరరావు, దేవి, కరుణ, నానాజీ, ప్రేమానందం పాల్గొన్నారు.

27 నుంచి మార్షల్ ఆర్ట్స్‌పై ఉచిత శిక్షణ

ఆలమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్ వీరుడు బ్రూస్లీ జయంతి సందర్భంగా 27 నుంచి యువతీ, యువకులకు ఉచితంగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు మార్షల్ ఆర్ట్స్ కోచ్ టి.అబ్బులు తెలిపారు. వివరాలకు 99893 83418లో సంప్రదించాలన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

కె.గంగవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విత్తనాల ఎంపికలో రైతులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక జిల్లా శాస్త్రవేత్త జి.నందకిషోర్ అన్నారు. శనివారం దంగేరులో సాగుకు సమాయత్తంలో ఆయన పాల్గొన్నారు. ఏ రకమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి, వాటిని ఎలా విత్తనశుద్ధి చేయాలనే అంశాలపై రైతులకు సూచనలు చేశారు. జిల్లా రైతు శిక్షణ కేంద్ర డీడీ జోతిర్మయి మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు షాపు బిల్లును భద్రపర్చుకోవాలన్నారు. వ్యవసాయశాఖ రామచంద్రపురం ఏడీఏ ఎఎస్‌వీ రంగారావు, ఏవో బులుసు రవి పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో మండలంలోని జిల్లా వనరుల కేంద్రం ఏవో మనోహన్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అందుబాటులోకి ఇసుక


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు అందుబాటులోకి ఇసుక తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేటలో బండారు బులిసత్యం కాపు కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా బడ్జెట్ రూపొందించారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. సమావేశంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, ధర్నాల రామకృష్ణ, చింతం విజయకృష్ణమోహన్, ముత్యాల బాబ్జి, బండారు బుల్లితాత, యల్లమిల్లి జగన్మోహన్, బూసి భాస్కరరావు సలాది చిన్ని, విశ్వ మారుతీప్రసాద్, వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ఆలమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆలమూరు కోర్టు ఆవరణలో వచ్చేనెల 14న జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఐ.ప్రవీణ్‌కుమార్ కోరారు. శనివారం కోర్టు ఆవరణలో ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను డిసెంబరు 14న జరిగే మెగా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. సమీక్షలో ఆలమూరు, అంగర, మండపేట, మండపేట రూరల్ పోలీసులు, ఆలమూరు ఎక్సైజ్ అధికారులు, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో లక్ష రుద్రాక్షపూజ


రుద్రాక్ష అలంకరణలో విశ్వేశ్వరస్వామి

రాయవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాయవరం పోలమ్మ ఆలయ సమీపంలో ఉన్న అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో లక్ష రుద్రాక్షపూజ, లక్ష బిల్వార్చనను శనివారం జరిపారు. మల్లిడి సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి, సత్తి ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ అర్చకులు విలపర్తి సూర్యనారాయణశర్మ, అంద్రంగి పండు, సురేష్‌శర్మ భక్తులతో సామూహిక వినాయకపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, మండపారాధనలు, సూర్యనమస్కారాలు జరిపారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శతసహస్ర సంఖ్యాక లక్ష రుద్రాక్ష పూజ, లక్ష బిల్వార్చన, అన్నపూర్ణదేవికి సహస్ర నామార్చనలు, కుంకుమపూజ, జ్యోతిర్లింగార్చన, మూల మంత్రహోమం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం జరిపారు.

25న సోమేశ్వరంలో లక్ష బిల్వార్చన: సోమేశ్వరం బాల త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో 25న లక్ష బిల్వార్చన జరుపుతున్నట్టు ఆలయ అర్చకుడు పరిటాల సోమశేఖరశర్మ తెలిపారు. కార్తీకమాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని స్వామి వారికి లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన, మహాలింగార్చన, సూర్యనమస్కారాలు, పూర్ణాహుతి జరుపనున్నట్టు తెలిపారు.

ఘనంగా సత్యసాయి జయంతి

రాయవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాయవరంలో సత్యసాయి జయంతిని శనివారం జరిపారు. రాయవరం సత్యసాయి మందిరంలో వేకువజాము నుంచే నగర సంకీర్తనలు, ప్రత్యేక భజనలు, హారతులు, పూజలు చేశారు. సత్యసాయి సేవా సమితి ప్రతినిధి గజ్జరపు కాశీ విశ్వనాధం ఆధ్వర్యంలో జరిగాయి. వలంటరీ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెలగల ఫణికృష్ణారెడ్డి, సీతాదేవి, పోతంశెట్టి తాతారెడ్డి, భారతీ దంపతులు వృద్ధులకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం సత్యసాయికి భక్తులు, పూజలు హారతులు ఇవ్వగా సమితి సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని కూర్మాపురం, పసలపూడి గ్రామాల్లో సత్యసాయి జయంతి జరిపారు.


భజన చేస్తున్న భక్తులు

శనేశ్వరాలయంలో భక్తుల సందడి


శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. శనివారం వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ.1,82,974 ఒకరోజు ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధర రావు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన, లక్షపత్రిపూజ

ఆలమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోని చండీ భైరవస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా లక్షబిల్వార్చన, లక్షపత్రి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు నరసింహదేవర వంశీకులు, దేవస్థానంల అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బిల్వార్చనలను వేదపండితులు జరిపారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు, లక్షపత్రి పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని మడికి బాలత్రిపురసుందరిదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్షబిల్వార్చన, లక్షపత్రి పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థుల మానవహారం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): జాతీయ ఫార్మసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబికపల్లి అగ్రహారం రాజరత్న ఫార్మసీ కళాశాల విద్యార్థులు శనివారం పట్టణంలో ర్యాలీ, రాజగోపాల్ సెంటర్‌లో మానవహారం జరిపారు. థింక్ హెల్త్ ... థింక్ ఫార్మసీ అంటూ నినాదాలు చేశారు. కళాశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ ఫార్మసిస్టు ఆవశ్యకత, ఫార్మసీ విద్యవల్ల ప్రయోజనాలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

రబీసాగుకు రైతులు శ్రీకారం

• దమ్ము పనుల్లో బిజీబిజీ • కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో హర్షాతిరేకాలు


పంట పొలంలో దమ్ము చేస్తున్న ట్రాక్టర్

రాయవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పనులు ముగించుకున్న రైతులు రబీ సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో దిగుబడి తగ్గిందని రైతులంటున్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయాలతో రైతులు తమకు నచ్చినచోట ధాన్యం విక్రయాలు జరిపేలా వెసులుబాటు కల్పించడంతో పాటు మద్దతు ధర ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి అధిక వర్షాలు కురవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో దాళ్వా పంటపై గంపెడాశతో రైతులు సాగుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు మండలంలో ఖరీఫ్ కోతలు 12 గ్రామాల్లో సుమారు 60 శాతం పూర్తికాగా మరో 3 రోజుల్లో 85 శాతం మేర కోతలు పూర్తి కానున్నట్టు ఏవో కె.ప్రభాకర్ తెలిపారు. ఖరీఫ్ మాసూళ్లు ముగించుకున్న రైతులు దాళ్వా పనులు చేపడుతున్నారు. బోర్లపై నారుమళ్లు వేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. దీనిలో భాగంగా ముందుగా నీరుపెట్టి ట్రాక్టర్లతో దమ్ము పనుల్లో బిజీగా ఉంటున్నారు. రాయవరం మండలంలో 12 గ్రామాల్లో రబీ సీజన్‌లో 14,650 ఎకరాల్లో వరిసాగు జరిగే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ చెబుతున్నారు. దాళ్వా పంటకు నీరు అవసరం తక్కువగా ఉండే వెదసాగుకు ఎక్కువ శాతం మంది రైతులు మొగ్గు చూపనున్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

మండపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అప్రమత్తంగా వుండాలని మండపేట రూరల్ ఎస్‌ఐ బుబ్బిబాబు కోరారు. తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాలలో శనివారం మహిళా సంరక్షణలో భాగంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తి సాయిబాబా జయంతి

మండపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సాయిబాబా జయంతిని వల్లూరి వీధిలోనున్న బాబా మందిరంలో శనివారం జరిపారు. బాబా ట్రస్టు నిర్వాహకులు వేగుళ్ల విజయలక్ష్మీ సారథ్యంలో ఉదయం నుంచి భజనలు, సంకీర్తనలు జరిగాయి. ముఖ్య అతిథిగా మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల హాజరయ్యారు. బాబా జయంతిని పురస్కరించుకుని ఆలమూరు రోడ్డులో వున్న అయ్యప్పస్వామి ఆలయంలో స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వీవీఎస్ఎస్ చౌదరి సతీమణి సత్యవతమ్మ, ఎమ్మెల్యే వేగుళ్ల కుటుంబ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

మండపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి చెందిన పలువురు వైద్యం కోసం ఇటీవల సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వారికి మంజూరైన రూ.14,97943 చెక్కులను శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల పార్టీ కార్యాలయంలో 16 మందికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు వున్నారు.

27 నుంచి మార్షల్ ఆర్ట్స్‌పై ఉచిత శిక్షణ

ఆలమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్ వీరుడు బ్రూస్లీ జయంతి సందర్భంగా 27 నుంచి యువతీ, యువకులకు ఉచితంగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు మార్షల్ ఆర్ట్స్ కోచ్ టి.అబ్బులు తెలిపారు. శిక్షణ తరగతులు ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్, అంగర, మండపేటలలో ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 7.30 వరకు జరుగుతాయన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 99893 83418లో సంప్రదించాన్నారు.


ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న స్వీపర్ల సంఘం నాయకులు

రేపు పాఠశాల స్వీపర్ల ధర్నా

కె.గంగవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద 25న ధర్నా చేస్తున్నట్టు పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల సంఘం నాయకులు కోటి పోలమ్మ తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో జరుపుతున్న ఈ ధర్నాను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. శనివారం ఎంఈవో కార్యాలయంలో అనుమతి కోరుతూ వినతిపత్రం అందించారు.

సోషల్ మీడియాపై అవగాహన అవసరం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ క్రైమ్ చట్టాలు అంశంపై అవగాహన సదస్సు జరిపారు. సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సోషల్ మీడియా ఎలా దుర్వినియోగం అవుతోంది, నివారణ, సైబర్ క్రైమ్ చట్టాలు శిక్షలపై తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, డాక్టర్ ఎన్‌వీ రమణ, అధ్యాపకులు కె.రవి బాబు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

లిధియా ఫార్మసీ కళాశాలలో జాతీయ వారోత్సవాలు



లిధియా ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న దృశ్యం

రావులపాలెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం ఈతకోట లిధియా ఫార్మసీ కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు కళాశాల సెక్రటరీ గొల్లపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో జరిపారు. ఈ సందర్భంగా ఫార్మసీ విద్యార్థులకు క్విజ్, పండ్ల డిజైనింగ్, ఆటల పోటీలు తదితర వాటిపై పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు, ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మనోహర్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వేగుళ్లను అభినందిస్తున్న కూటమి నేతలు

ఎమ్మెల్యే వేగుళ్లకు అభినందనల వెల్లువ

మండపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును కూటమి నేతలు, అభిమానులు శనివారం అభినందించారు. మండపేట పార్టీ కార్యాలయంలో నియోజక వర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజా ప్రతి నిధులు, కూటమినేతలు ఆయన్ను సత్కరించారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ పార్టీ కార్యాలయంలో ఆయన్ను సత్కరించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వల్లూరి వీరబాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గడి సత్యవతి, మల్లిపూడి గణేష్, జెడ్. మేడపాడు సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్, వాదా ప్రసాద రావు, జాస్తి వేంకటేశ్వరరావు, మేడపాటి రవీంద్రారెడ్డి, రిమ్మలపూడి వేణుగోపాలదొర, మండల టీడీపీ అధ్యక్షులు, ఉంగరాల రాంబాబు, యరగతపు బాబ్జి, చింతా దొరబాబు, మాజీ సర్పంచ్ మండా వీరభద్రరావు, కర్రి తాతారావు, అర్తమూరు గ్రామ ఉపసర్పంచ్ కర్రి సత్యనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎన్.వీ.రెడ్డి, పిల్లా తాతీలు, మాజీ ఎంపీటీసీ, పెన్మెత్స రమేష్‌రాజు, సలాది బాల సుబ్రహ్మణ్యం, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు తదితరులు అభినందించారు.

కుల సంఘాల అభినందనలు: ఎమ్మెల్యే వేగుళ్లను పలు కుల సంఘాలు, వివిధ పార్టీల నాయకులు అభినందించారు. మండపేట పార్టీ కార్యాలయంలో శనివారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు ఆధ్వర్యంలో కాపు నాయకులు ఆయన్ను అభినందించారు. పట్టణ ముస్లిం సంఘ నాయకులు అల్తాఫ్, ఇబ్రహిం తదితరులు ఆయన్ను అభినందించారు.

భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కపిలేశ్వరపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న అలివేలుమంగ భూదేవి సమేత శ్రీ వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు బారులుతీరి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాన జరిపారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు రాటముహూర్తం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో నున్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం రాట ముహూర్తం జరిపారు. వచ్చేనెల 7న జరిగే షష్ఠి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాటకు పూజల అనంతరం రాట ముహూర్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


వన సమారాధనలో మాట్లాడుతున్న ఎంపీ బోస్

చదువుతో మహత్తర అవకాశాలు

ద్రాక్షారామ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చదువుతో మహత్తర అవకాశాలు ఉన్నాయని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో పిల్లి అప్పారావు కల్యాణమండపం ఆవరణలో జరిగిన శెట్టిబలిజ కార్తీకవనసమారాధనలో ఆయన మాట్లాడారు. శాసనమండలి మాజీ వైస్ చైర్మన్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజ సంఘాన్ని స్థాపించి మనకు దారి చూపారన్నారు. సంఘీయుల త్యాగాల ఫలితంగానే తమకు పదవులు వచ్చాయన్నారు. మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ శెట్టిబలిజ వర్గానికి నమ్మకం అనే క్రెడిబిలిటీ ఉందని అందుకే రాజకీయ పార్టీలు అవకాశాలు ఇస్తున్నాయన్నారు. అనంతరం డాక్టర్ కాద వెంకటరమణ తదితరులు మాట్లాడారు. సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టరు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పెంకె సాంబశివరావు, డాక్టర్ యనమదల మురళీకృష్ణ, యనమదల గీత, ఏపీఐడీసీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్, మాజీ ఎంపీపీ కట్టా సూర్యనారాయణ, శెట్టిబలిజ సంఘం నాయకులు నరాల ఏడుకొండలు, మేడిశెట్టి ఇజ్రాయేల్, ఎంపీపీ వంపన నాగమణి, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

ఆలమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మడికిలో అయ్యప్ప స్వామి పడిపూజను జరిపారు. గ్రామంలోని పోలేరమ్మ ఆలయం వద్ద చెల్లుబోయిన సురేష్ స్వామి, చెల్లుబోయిన పోతురాజుస్వామి, వల్లి కృష్ణకిరణ్‌స్వాములు ఏర్పాటు చేసిన పడిపూజ కార్యక్రమాన్ని పీఠం గురుస్వామి దొండపాటి సుబ్బరాజు అధ్వర్యంలో అయ్యప్పస్వామికి పూజలు, అభిషేకాలు జరిపి అనంతరం పడిపూజ చేశారు. బడుగువానిలంక గ్రామానికి చెందిన కొమ్మల శివస్వామి భజనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చెముడులంక గురుస్వామి గార పాటి శివన్నారాయణ, మల్లవానితోట గురుస్వామి చెల్లుబోయిన సత్యనారాయణతోపాటు లంక గ్రామాల అయ్యప్పస్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.


మడికిలో జరిగిన పడిపూజలో పాల్గొన్న అయ్యప్పస్వామి భక్తులు


సోమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న మంత్రి సుభాష్

సోమేశ్వరుడికి మంత్రి సుభాష్ పూజలు

కె.గంగవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి ఛాయాసోమేశ్వరస్వామిని కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఈవో భీమశంకరం ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. సోమేశ్వరస్వామికి మంత్రి అభిషేకాలు చేశారు. రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. బేడా మండపంలో వేదపండితులు ఆశీర్వాదం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కొత్తపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పేదలకు అప్పుడు సీఎం చంద్రబాబు అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం కాపు కల్యాణ మండప ఆవరణలో వైద్యం చేయించుకుని సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 13 మంది లబ్ధిదారులకు రూ.22,35,296 చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, ధర్నాల రామకృష్ణ, చింతం విజయకృష్ణమోహన్, ముత్యాల బాబ్జి, బండారు బుల్లితాత, యల్లమిల్లి జగన్మోహన్, బూసి భాస్కరరావు, వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పందులు సంచరిస్తే చర్యలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి దూరంగా పందులను కట్టడి చేయాలని అధికారులు తెలిపారు. పట్టణంలో పందులు సంచరిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ మేనేజరు పీఎస్ఆర్ మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ రాజు అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో పందుల పెంపకందారులతో సమావేశం జరిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నందున అన్ని చర్యలు తీసుకోవాలని వారికి తెలిపారు.


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఆర్డీవో

ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఆర్డీవో

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆర్డీవో దేవరకొండ అఖిల పరిశీలించారు. ముందుగా పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న ఓటరు జాబితా తప్పుల సవరణను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో కనీస వసతులపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం వండుతున్న తీరు, వంటలు, బియ్యం పరిశీలించారు. అనంతరం జడ్పీ బాలికోన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు.


వివరాలు తెలుసుకుంటున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు

సబ్‌జైలు తనిఖీ

కొత్తపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సబ్‌జైలును శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించిన అనంతరం అక్కడి వసతులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సబ్‌జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముమ్మిడివరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిలిస్టు ఢీకొనడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చినకొత్తలంక పంచాయతీ పరిధిలోని కొత్తకాల్వకు చెందిన పొత్తూరి రాజగోపాలవర్మ ఉద్యోగ రీత్యా కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని జీడిమెట్లలోని షాపూర్ నగర్‌లో ఉంటున్నాడు. తల్లిదండ్రులు కొత్తలంకలో ఉంటున్నారు. తండ్రి అనారోగ్యానికి గురవ్వడంతో పది రోజుల క్రితం రాజగోపాల్‌వర్మ కొత్తలంక వచ్చాడు. శుక్రవారం బ్యాంకులో సొమ్ములు తీసుకునేందుకు ఆటోలో ముమ్మిడివరం వచ్చి బ్యాంకులోకి నడిచి వెళుతుండగా అమలాపురంవైపు నుంచి వస్తున్న మోటారు సైకిలిస్టు ఢీకొనడంతో రాజగోపాలవర్మ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ముమ్మిడివరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.